

- ఏలూరు లోక్‌సభలో బీసీ నినాదం
- తొలిసారి పోటీకి ప్రధాన పక్షాల అవకాశం
- ఉద్ధండులు ఢీకొన్న నరసాపురం నేలపై నవతరం
- సిట్టింగ్ ఎంపీ రఘురామరాజు ఏం చేయబోతున్నారు
- కాంగ్రెస్ నుంచి బాపిరాజు నిలబడతారా ?

అంతా.. కొత్తే!

టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి కూటమి ఏలూరు, నరసాపురం లోక్‌సభ స్థానాల్లో శంఖారావం పూరిస్తోంది. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో పోటీకి దిగిన అభ్యర్థుల్లో నరసాపురం బీజేపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ మినహా మిగతా ప్రధాన పక్షాల అభ్యర్థులంతా కొత్తముఖాలే. గడిచిన ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఎంపీ సీట్లలో రాజకీయ స్వరూపమే మారిపోయింది. ఈ రెండు నియోజవకర్గాల్లో ఇంతకు ముందు రాజకీయ దిగ్గజాలే పోటీ పడేవి. దీనికి భిన్నంగా ఈసారి పోటీ ఆసాంతం వైసీపీ, ప్రధాన కూటమి అభ్యర్థుల మధ్యే హోరాహోరీగా జరగనుంది.

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఏలూరు, నరసాపురం ఎంపీ సీట్లలో కొత్తముఖాలు

ఏలూరు లోక్‌సభలో యువ కెరటం

ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా వ్యాపార రీత్యా పట్టున్న, రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన పుట్టా మహేష్‌కుమార్‌యాదవ్‌ను బరిలోకి దింపారు. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడైన ఆయన కడప జిల్లా మైదుకూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తున్న పుట్టా సుధాకర్ తనయుడు. రెండు కుటుంబాలూ రాజకీయ నేపథ్యం కలిగి వుండడంతో చంద్రబాబు మహేష్‌కు అవకాశం ఇచ్చారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ఎలాగూ రామకృష్ణుడికి పట్టు ఉంది కాబట్టి, ఈసారి ఏలూరులో తమ అభ్యర్థికి ప్రత్యేక అదనపు అర్హత అవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయన ముఖ్యనేతలతో భేటీ అయినప్పుడు ఎలాంటి తడబాటు లేకుండా తాను గెలిస్తే నియోజకవర్గానికి ఎలాంటి మేలు చేస్తానో స్పష్టంగా వివరించారు. ఇదే స్థానం నుంచి పోటీ చేయాలనుకున్న లోక్‌సభ ఎన్నికల్లో సీనియర్ అయిన మాగంటి బాబును పక్కనబెట్టారు. నాలుగు రోజులుగా ఆయన ఎవరికీ అందుబాటులో లేకపోవడం, సోమవారం మహేష్ పరిచయ కార్యక్రమానికి దూరంగా ఉండడంతో కొందరి మధ్య చర్చకు దారితీసింది. తగు సమాచారంతోనే ఈ కార్యక్రమానికి గైర్హాజరయ్యారా.. వ్యక్తిగత పనుల మీద రాలేకపోయారా అనేది తేలలేదు. ఇదే లోక్‌సభా స్థానం పరిధిలో తొలిసారిగా పోటీ చేస్తున్న మహేష్ కుమార్‌తో తలపడనున్న వైసీపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ లోక్‌సభ ఎన్నికల బరిలో దిగడం కొత్తే కావడం యాదృచ్ఛికం. కావూరి సాంబశివరావు, బోళ్ళ బులిరామయ్య, కొమ్మారెడ్డి సూర్యనారాయణ, మాగంటి బాబు, సూపర్‌స్టార్ కృష్ణ వంటి వారు ఈ స్థానం ఇంతకుముందు గెలుపొందారు. ఇపుడు ఆ తరం అంతా తెరమరుగు కాగా మాగంటి బాబు మాత్రం ఈసారి తాను పోటీకి సిద్ధమని ముందుకెళ్ళినా అవకాశం ఇవ్వలేదు. ఏలూరు లోక్‌సభ స్థానం పరిధిలో ప్రధాన పక్షాలు బీసీ నినాదం అందుకోవడం ఈసారి విశేషం.

నరసాపురంలోనూ నవ శకం..

నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలో ఈసారి నవశకం లోక్‌సభ బరిలో పోటీకి నిలిచింది. తాజాగా ఉమ్మడి అభ్యర్థిగా బీజేపీకి చెందిన భూపతిరాజు శ్రీనివాసవర్మ రంగంలో నిలిచారు. 2009 ఎన్నికల్లో ఆయన ఇదే స్థానం నుంచి పోటీకి నిలిచారు. ఆయనకు రెండోసారి బీజేపీ అవకాశం ఇచ్చింది. ఇక్కడి నుంచి పోటీ చేయడం తమ రాజకీయ ప్రతిష్ఠకు సంకేతంగా అక్కడి నేతలు భావిస్తారు. ఒకప్పుడు భూపతిరాజు విజయకుమార్‌రాజు, బలరాజు, కొత్తపల్లి సుబ్బారాయుడు, చేగొండి హరిరామజోగయ్య, కనుమూరి బాపిరాజు, రెబల్‌స్టార్ కృష్ణంరాజు, గోకరాజు గంగరాజు, గత ఎన్నికల్లో రఘురామకృష్ణంరాజు ఈ స్థానం నుంచే గెలుపొందారు. నరసాపురం నుంచి ఎన్నికైన వారంతా రాజకీయాల్లో రాటుదేలడం, రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో ఆసాంతం ప్రముఖంగా ఉంటారు. అలాంటి అవకాశాన్ని తాజాగా బీజేపీ అభ్యర్థి శ్రీనివాసవర్మ చేజిక్కించుకుని పోటీకి దిగారు. మరోవైపు వైసీపీ అభ్యర్థిగా బీసీ వర్గానికి చెందిన గూడూరి ఉమాబాలను రంగం లోకి దించారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె లోక్‌సభ ఎన్నికల బరిలో నిలవడం ఇదే ప్రథమం. గతంలో మునిసిపల్ రాజకీయాలకే పరిమితమైనప్పటికీ ఈసారి వైసీపీ నుంచి పోటీ చేస్తుంది.

రఘురామను ఏం చేయబోతున్నారు ?



సిట్టింగ్ ఎంపీ రఘురామకృష్ణంరాజు నరసాపురం లోక్‌సభ స్థానం నుంచి ఏదొక పార్టీ తరపున పోటీ చేసే ఉద్దేశం ఉన్నా చివరకు అది నెరవేరలేదు. నరసాపురం బీజేపీ నుంచి ఆయనకు సీటు దక్కడం ఖాయమని అందరూ ఊహించినా, దీనికి విరుద్ధంగా ప్రతికూల ప్రకటనలు వచ్చాయి. ఇప్పుడందరి దృష్టి రఘురామపైనే పడింది. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన వీలైతే విజయనగరం పార్లమెంటరీ స్థానం నుంచి పోటీ చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఇన్నాళ్లూ వైసీపీని ఎదిరించి నిలిచినా, ఆయన విషయంలో ఇప్పటి వరకు చోటు చేసుకున్న పరిణామాలను కొందరు తప్పు పడుతున్నారు. ఆయన కూడా వచ్చే రోజుల్లో ఎవరూ ఊహించని రీతిలో తాను ముందుకు దూసుకుపోతానని ప్రకటించారు. ఒకవేళ విజయనగరం లోక్‌సభ నుంచి అవకాశం ఇస్తే సరే, లేకుంటే మరేదైనా అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం లేకపోలేదు. ఇప్పటికే పలు అసెంబ్లీ స్థానాల పేర్లు పదే పదే ప్రస్తావనకు వస్తున్నాయి. నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలోనే ఉన్న అసెంబ్లీ స్థానం నుంచే వీలైతే ఆయన పోటీకి దిగుతారంటూ ఆ నోటా ఈ నోటా ఇప్పటికే నానుతోంది.



ఏలూరులో మాట్లాడుతున్న మహేష్

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి


టీడీపీ ఎంపీ అభ్యర్థి మహేష్ కుమార్

ఏలూరు, మార్చి 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'అందరికీ అందుబాటులో ఉండి కష్టసుఖాల్లో తోడుగా ఉంటా. నియోజకవర్గాన్ని అభివృద్ధిని చేస్తా గెలిపించి, ఆశీర్వదించండి' అని ఏలూరు లోక్‌సభ టీడీపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ కోరారు. సోమవారం ఏలూరు టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలు, నేతలు, సీనియర్లతో ముఖాముఖి పరిచయం కార్యక్రమం నిర్వహించారు. తొలుత హనుమాన్ జంక్షన్‌లోని అంజనేయస్వామికి పూజలు చేసి వచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి కూటమి అభ్యర్థులు, పార్టీల శ్రేణులతో భేటీ అయ్యారు. మీడియాతో మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు, మీ అందరి ఆశీస్సులతో తాను ఏలూరు లోక్‌సభా స్థానం నుంచి పోటీకి దిగినట్లు తెలిపారు. 'వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. తిరిగి అభివృద్ధి చెందాలంటే టీడీపీ గెలిపించాలి. మహిళలకు ఆర్థికాభివృద్ధి, యువతకు ఉద్యోగాలు చంద్రబాబు సీఎం అయితేనే సాధ్యం. రాష్ట్రంలో పరిశ్రమలు రావాలన్నా, శాంతిభద్రతలు అదుపులో వుండాలన్నా, టీడీపీ పాలనలోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారు. వైసీపీ పాలనలో టీడీపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేస్తాం. కేడర్ ఎవరూ భయపడనవసరం లేదు. నియోజకవర్గ ప్రజలంతా నన్ను తోడబుట్టినవాడిగా చూడాలి' అని అభ్యర్థించారు. మహేష్ గెలుపు ఖాయమని, బీసీ వర్గాల నుంచి ఎంపిక చేసి వారికి తగిన గౌరవం ఇచ్చారని, నియోజక వర్గాల నేతలు అభిప్రాయపడ్డారు. పలు నియోజక వర్గాల నుంచి వచ్చిన నేతలు కార్యకర్తలు ఆయనను ఆలింగనం చేసుకుని గెలుపు మీదేనంటూ ఆశీర్వదించారు. ఆయనతోపాటు దెందులూరు, ఏలూరు, చింతలపూడి, ఉంగుటూరు, పోలవరం కూటమి అభ్యర్థులు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, రోషన్‌కుమార్, ధర్మరాజు, చిర్రి బాలరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు ఘంటా మురళి, మరడాని రంగారావు, టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి మందలపు రవి, ఉమ్మడి కూటమి అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ సహా పలు పక్షాలకు చెందిన ముఖ్యనేతలంతా పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో ఆంజనేయుడికి మహేష్‌యాదవ్ పూజలు

కాంగ్రెస్‌లో బాపిరాజు సంగతేంటి ?



కాంగ్రెస్ అభ్యర్థులుగా లోక్‌సభ స్థానం నుంచి ఎవరు పోటీ చేస్తారనే విషయమై కాస్త ఆసక్తి ఆరంభమైంది. మొదటి నుంచి నరసాపురం లోక్‌సభ నుంచి పోటీకి దిగిన మాజీ ఎంపీ, మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నేత కనుమూరి బాపిరాజు అడుగులు ఎటువేయబోతున్నారనే దానిపైన ఇప్పటికే అందరి నోటా ప్రశ్నగా మారింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం తర్వాత ఏలూరు లోక్‌సభ స్థానం కన్వీనర్‌గా బాపిరాజు, నరసాపురం లోక్‌సభా స్థానానికి జెట్టి గురునాథరావును నియమించారు. వీరిలో గురునాథరావు ఇప్పటికే కాంగ్రెస్‌కు రాజీనామా చేసి వైసీపీలో చేరారు. ఈ పరిస్థితిలో కాంగ్రెస్‌నే అంటిపెట్టుకుని ఉన్న బాపిరాజును తిరిగి క్రియాశీలక రాజకీయాల్లోకి రప్పించి ఆయనను తిరిగి నరసాపురం నుంచే పోటీకి దించుతారా లేదా అనేది ఇంకా తేలాల్సి ఉంది. ఏలూరు స్థానం నుంచి దాదాపు అర డజను మందికి పైగా ఎంపీగా పోటీ చేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఇదంతా నెలాఖరుగానీ తేలకపోవచ్చు.

నేడు, రేపు భువనేశ్వరి పర్యటన



ఏలూరు/తాడేపల్లిగూడెం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టు కోలేక మరణించిన పార్టీ కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను పరా మర్శించేందుకు ఆయన సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరిట ఉమ్మడి పశ్చి మగోదావరి జిల్లాలో మంగళ, బుధవారాల్లో పర్యటిస్తారు. తొలిరోజు ఎర్రంపేట, కన్నాయగూడెం, బయ్యన్నగూడెం, పేరంపేట, చింతలపూడి ప్రాంతాల్లో పర్యటిస్తారు. రెండో రోజు బుధవారం తాడేపల్లిగూడెం, ఉంగుటూరు నియోజక వర్గాల పరిధిలోని కుంచనపల్లి, పడమరవిప్పర్రు తదితర గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శి స్తారు. అనంతరం విజయవాడ పయనమవుతారు. ఈ మేరకు తాడేపల్లిగూడెంలో టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఏర్పాట్లు చేశారు.

అధికార బృందాల విస్తృత తనిఖీలు

ఏలూరు క్రైం, మార్చి 25 : జిల్లావ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒక వైపు పోలీసులు, మరోవైపు ఎన్నికల తనిఖీల అధికార బృందాలు విస్తృతంగా ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లాకు ఆనుకుని ఉన్న తెలంగాణ రాష్ట్ర సరిహద్దులలో ఉన్న చెక్‌పోస్టుల్లో 24 గంటలు నిరంతరం అన్ని వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. చింతలపూడి పోలీస్ స్టేషన్ పరిధిలోని అల్లిపల్లి, లింగగూడెం, టి.నరసాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంకపల్లి, జీలుగుమిల్లి పరిధిలో తాటిఆకులగూడెం, వేలేరుపాడు పరిధిలో మేడేపల్లి, కుక్కునూరు పరిధిలో వేలేరు, చాట్రాయి పరిధిలో కృష్ణారావుపాలెం, పార్వతీపురం వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలన్నీ తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు రహదారులు కలిపేవిగా ఉండడంతో అక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎస్ఈబీ అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు ఆదేశాలతో ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు జిల్లాలో అక్రమ మద్యం, సారా తయారీ, గంజాయి రవాణా కాకుండా ముందస్తుగా విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. మరోవైపు లా అండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు చేస్తూ మద్యం కలిగిన పలువురిని అరెస్టు చేస్తున్నారు.

ఎన్నికల కోడ్ ఈనెల 16వ తేదీ నుంచి అమల్లోకి రావడంతో జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్‌లు రంగంలోకి దిగాయి. ఎన్నికల అధికారులుగా ఉన్న జిల్లా అధికారులు తమ బృందాలతో ఆకస్మికంగా పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న ఎనిమిది చెక్ పోస్టులే కాకుండా జిల్లాలో పలు ప్రధానమైన రహదార్లలో చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. వీటి వద్ద పోలీసులు, పలు శాఖల అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. ఎస్పీ పర్యవేక్షణలో ఇప్పటికే నిఘా బృందాలను రంగంలోకి దించారు. సమాచార సేకరణను చేపట్టారు. ఇంకోవైపు ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విట్టర్ వంటి మీడియా మాధ్యమాల్లో ఎవరైనా తప్పుడు సమాచారం పెడితే వెంటనే వారిని అరెస్టు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. 24 గంటలు నిరంతరం మీడియా మాధ్యమాలను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో తనిఖీలు చేపట్టడమే కాకుండా వాహనాల రికార్డులు పరిశీలించడంతో పాటు, ఎవరైనా రూ.50 వేలకు మించి ఎక్కువ నగదు తీసుకువెళితే ధ్రువపత్రాలను చూపించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు.



ఏలూరు వన్‌టౌన్‌లో వన్‌టౌన్ సీఐ తనిఖీలు

ఏప్రిల్ 18 నుంచి తనిఖీలు ముమ్మరం

రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వచ్చిన తరువాత తనిఖీల ప్రక్రియ వేగవంతం చేపడతానికి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాకు వచ్చిన కేంద్ర పారామిలటరీ బలగాలను గ్రామాల్లో కవాతులు నిర్వహించారు. జిల్లా ఆర్మ్‌డ్ విభాగానికి చెందిన డిస్ట్రిక్ట్ గార్డ్సును చెక్‌పోస్టుల వద్ద ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల్లో సంబంధిత పోలీస్‌స్టేషన్ సీఐలు, ఎస్ఐలు తనిఖీలు చేపడుతున్నారు. ఏలూరు నగరంలో ఈ తనిఖీలను విస్తృతం చేశారు.

ఎనిమిది చెక్ పోస్టుల్లో నిరంతర సోదాలు : ఎస్పీ



జిల్లాలో గత ఏడాది డిసెంబరు డిసెంబరు 26 నుంచి 8 చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి 24 గంటలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి సోమవారం రాత్రి తెలిపారు. ఆ చెక్‌పోస్టుల వద్ద 53 లక్షల 97 వేల రూపాయల నగదు, 1154.1 లీటరు మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎనిమిది లక్షల 87 వేల రూపాయలు విలువైన ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి 31 ఫ్లయింగ్ సెర్వైలన్స్ టీమ్‌లు జిల్లా మొత్తం తిరుగుతున్నాయన్నారు. ఇప్పటివరకు పది లక్షల 36 వేల 710 రూపాయలు నగదు, 1,398 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు. చెక్‌పోస్టుల ఏర్పాటు చేయడం లేదని దుష్ప్రచారం జరుగుతుందని ఇది పూర్తిగా అవాస్తమన్నారు.

సరిపల్లిలో రూ.87 వేలు స్వాధీనం

ఉంగుటూరు, మార్చి 25 : ఉంగుటూరు నియోజకవర్గంలోని సరిపల్లి గ్రామం వద్ద కర్నాటకకు చెందిన ఓ వ్యకి కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన శ్రీనివాసరాజు అనే వ్యక్తి నుంచి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేయగా రూ.82 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ఖాజావలి తెలిపారు.

రాజకీయ ప్రకటనలకు ఆమోదం తప్పనిసరి

కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్

ఏలూరుసిటీ, మార్చి 25: ఎన్నికల నేపథ్యంలో ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్- మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ఆమోదం పొందాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేశ్ సోమవారం ఓ ప్రకనటలో పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రసారం చేసే ప్రకటనలకు జిల్లా ఎంసీఎంసీ కమిటీ ఆమోదం తెలపాల్సి ఉంటుందన్నారు. పెయిడ్ న్యూస్, రాజకీయ ప్రకటనలను తనిఖీ చేసేందుకు జిల్లాస్థాయిలో ఎంసీఎంసీ కమిటీని నియమించామన్నారు.ఎలక్ట్రానిక్ మీడియాలో రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయదలచిన తేదీకి కనీసం మూడు రోజుల ముదు సంబంధిత రిజిస్టర్ రాజకీయ పార్టీలు దరఖాస్తు చేసుకోవాలని, ఆ తర్వాత రెండు రోజుల్లో దానిపై కమిటీ నిర్ణయిం తీసుకుంటుంది. ఎలక్ట్రానిక్ మీడియా రాజకీయ ప్రకటనలపై ఈసీ నిబంధనలు పాటించాలి. వార్తల ముసుగులో రాజకీయ పార్టీలు అన్ని రకాల మీడియాలలో ఇచ్చే ప్రకటనలను ఎంసీఎంసీ స్క్రూటినీ చేస్తుందన్నారు. ఎంసీఎంసీ మానిటరింగ్ సెల్‌ను ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు.

వలంటీర్ తొలగింపు

ఏలూరు రూరల్, మార్చి 25: ఏలూరు నగర కార్పొరేషన్‌లో విలీనమైన తంగెళ్ళమూడి-2 గ్రామ పంచాయతీలోని సీ7 క్లస్టర్ వలంటీరు షేక్ సత్తార్‌ను విధుల నుంచి తొలగించామని ఏలూరు ఎంపీడీవో బి.ప్రవీణ ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. రాజకీ యపరమైన కార్యక్రమంలో పాల్గొన్నట్లు తమ విచార ణలో తేలినందున, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అనుసరించి వలంటీర్‌ను విధుల నుంచి తొలగించామన్నారు.

■ ఆంధ్రజ్యోతితో ఆఫీసర్

ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం

ఏలూరు ఆర్‌వో ఎం.ముక్కంటి



- ఏలూరు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే ఏర్పాటు చేసిన ఐదు టీమ్‌లలో ప్రధానంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎంసీసీ, స్టాటికల్ సర్వే లెన్స్ టీమ్‌లతోపాటు ఇతర టీమ్‌లను ఏర్పాటు చేశాం. నిబంధనలు కచ్చితంగా అమలయ్యేలా చూస్తున్నాం. ఇప్పటి వరకు వీటిని పాటించని ముగ్గురిని సస్పెండ్ చేశాం.
- ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో నగరంతోపాటు రూరల్ గ్రామాల్లో వున్న మొత్తం 2,30,724 మంది ఓటర్లకు 212 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.
- కోడ్ ఉల్లంఘనలపై ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌కు లేదా సీ విజిల్ యాప్‌లోను అప్‌లోడ్ చేయవచ్చు.
- 12 వేల ఓటరు గుర్తింపు కార్డులు అందించాం. కార్డులు లేకపోయినా ఎన్నికల కమిషన్ ధ్రువీకరించిన 12 రకాల కార్డులను తీసుకువచ్చి ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.
- 85 ఏళ్ల దాటిన వృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రానికి రాకుండానే ఇంటి వద్దే ఓటు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నాం.
- అభ్యర్థులు నియమావళి ప్రకారం ప్రచారం చేసుకోవాలి. సమావేశాల నిర్వహణ, లౌడ్ స్పీకర్ల వినియోగం, సమావేశాలకు స్థలాలు నిర్ణయం, ర్యాలీలు, వాహనాల అనుమతుల కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేస్తే అనుమతులు ఇస్తాం.

- ఏలూరు సిటీ

ఈసారి యువ ఓటర్లే కీలకం

- జిల్లాలో 18 నుంచి 29 ఏళ్ల లోపు ఉన్న మొత్తం ఓటర్లు 3,21,279
- తుది జాబితా తర్వాత కొత్త ఓటర్లు 12,533



ఏలూరుసిటీ, మార్చి 25 : సార్వత్రిక ఎన్నికల సమరం ప్రారంభమైంది. అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల రణరంగంలో ప్రచార పర్వంలో దూసుకు పోతున్నారు. ఈసారి ఎన్నికలలో యువ ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లాలో తుది ఓటర్ల జాబితా ప్రకారం మొత్తం 16,24,416 మంది ఓటర్లు ఉన్నారు. మహిళా ఓటర్లు 8,30,390 మంది ఉండగా, పురుష ఓటర్లు 7,93,897 మంది, ఇతరులు ఉన్నారు. తుది ఓటర్ల జాబితా విడుదల తర్వాత కూడా ఓటర్ల నమోదు కొనసాగుతోంది. ఇప్పటివరకు 12,533 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. ఈ మేరకు యువ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక అభ్యర్థుల ఎంపిక విషయాని కొస్తే జిల్లాలో ఇప్పటికే కూటమి(టీడీపీ, జనసేన, బీజేపీ) అభ్యర్థుల ఎంపిక కాగా, అధికార పార్టీ తమ అభ్యర్థులను ఎంపిక చేసింది. ప్రధాన పార్టీలలో కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. త్వరలో ఆయా పార్టీల అభ్యర్థుల ఎంపిక పూర్తవుతుందని తెలుస్తోంది. గతంలో జరిగిన ఈ ఎన్నికలకు ఇప్పటికీ ఎంతో వ్యత్యాసం ఉంటుందని భావిస్తున్నారు. ఈసారి ఎన్నికలలో యువ ఓటర్లే విజయావకాశాలను నిర్ధేశించే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

18 నుంచి 29 ఏళ్ల లోపు ఓటర్లు 3,21,279

జిల్లాలో 18 నుంచి 29 ఏళ్ల లోపు వయస్సు గల ఓటర్లు మొత్తం 3,21,279 మంది ఉన్నారు. 18 నుంచి 19 ఏళ్ల లోపు ఓటర్లు 37,877 మంది, 20 నుంచి 29 ఏళ్లలోపు ఓటర్లు 2,83,402 మంది ఉన్నారు. వీరంతా యువ ఓటర్లు కిందే వస్తారు. వీరితో పాటు కొత్తగా ఓటర్లుగా నమోదైన వారిలో అత్యధిక శాతం యువ ఓటర్లే అని చెప్పవచ్చు. సంఖ్య తెలియకపోయినా కొత్త ఓటర్లలో ఎక్కువ మంది యువ ఓటర్లే. ఈక్రమంలో జిల్లాలో కొత్తగా 12,533 మంది ఓటర్లు తమ ఓటును నమోదు చేసుకున్నారు. నియోజకర్గాల వారీగా కొత్త ఓటర్ల వివరాలివి.. ఉంగుటూరు నియోజకవర్గంలో 963, దెందులూరు-1,792, ఏలూరు-3,038, పోలవరం 1,467, చింతలపూడి-2,340, నూజివీడు-1,357, కైకలూరు-1,576 మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితా విడుదల తర్వాత కొత్త ఓటర్ల చేరికతో జిల్లాలో మొత్తం ఓటర్లు 16,36,949 మంది ఉన్నారని లెక్కలు తేలాయి. ఇంకా ఓటర్ల నమోదు జరుగుతుండడంతో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది.

యువ ఓటర్లే కీలకం

ఈసారి ఎన్నికలలో యువ ఓటర్లే కీలకం కానున్నారని, కొన్ని నియోజకవర్గాలలో గెలుపు, ఓటమిలను నిర్ణయించేది యువ ఓటర్లే అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గత ఎన్నికల కంటే ఈసారి ఓటర్లలో చైతన్యం రావటం, ఓటర్ల నమోదుపై విస్తృతంగా ప్రచారం జరగడం, స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్లలో అవగాహన కల్పించడంతో ఈసారి ఓటింగ్‌లో యువ ఓటర్లు ఎక్కువగా పాల్గొనే అవకాశాలున్నాయని చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈసారి ఎన్నికలలో పోలింగ్ శాతం పెరుగుతుందని చెబుతున్నారు. ఈ పరిస్థితులన్నింటినీ బేరీజు వేసుకుంటే ఈసారి ఎన్నికలలో యువ ఓటర్లు ఎవరికి ఓటు వేస్తారో అనే విషయాలు ఆసక్తికరంగా తయారయ్యాయి.

ఉత్సాహంగా హోలీ



ఏలూరు ఇండోర్ స్టేడియంలో హోలీ సంబరాలు





తాడేపల్లిగూడెం 23వ వార్డు చిన ముత్యాలమ్మ ఆలయం వద్ద శిలా ఫలకానికి , రేవుకు వేసిన రంగులు

వైసీపీ రంగుల మాటేంటి ?

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 25 : తాడేపల్లిగూడెం 23వ వార్డులోని చిన ముత్యాలమ్మ ఆలయానికి మున్సిపాలిటీ నిధులు రూ.4 లక్షలతో ఆధునికీకరణ పనులు చేపట్టి చుట్టూ వైసీపీ రంగులు వేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనుల నిమిత్తం వేసిన శిలా ఫలకంలో పేర్లు కనిపించకుండా పేపరు అతికించిన అధికారులు శిలా ఫలకానికి, రేవుకు ఇరు వైపులా వేసిన వైసీపీ రంగులు మాత్రం తొలగించలేదు.

సీఎం ఫొటో లేని ధ్రువీకరణ పత్రాలు జారీ

జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారావు

ఏలూరుసిటీ, మార్చి 25:జిల్లాలో ఎన్నికల కోడ్ నిబంధనల మేరకు గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి ఫొటో లేని ధృవీకరణ పత్రాలు జారీ చేస్తున్నామని జిల్లా పరిషత్ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ధృవీకరణ పత్రాల జారీ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఏలూరు జిల్లాకు 88 వేల ఫారాలను మంజూరు చేసిందని , జిల్లాకు ఇప్పటికే 44 వేల హై సెక్యూరిటీ ధృవపత్రాల ఫారాలు అందాయని, వాటిని జిల్లాలోని అన్ని గ్రామ/వార్డు సచివాలయాలకు పంపామన్నారు. మరో 40 వేల ఫారాలు రెండు రోజుల్లో జిల్లాకు అందుతాయన్నారు. విద్యార్థులకు, రైతులకు, వివిధ వర్గాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలను సీఎం ఫొటో లేకుండా అందిస్తున్నామన్నారు.

నిట్ విద్యార్థులకు బహుమతులు



బహుమతి అందుకుంటున్న విద్యార్థి పార్థసారథి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 25 : విద్యార్థులు చదువుతో పాటూ ఆవిష్కరణలో కూడా ప్రతిభ కనపర్చడం అభినందనీయమని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్‌శంకర్‌రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌కు చెందిన నల్గురు విద్యార్థులు వేర్వేరు విభాగాలలో రెండు బహుమతులను సాధించడంతో ఏపీ నిట్ ఇంచార్జి డైరక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి, దినేష్‌శంకర్‌రెడ్డి అభినందించారు. దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ మెటలార్జికల్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థి రాఘవరపు పార్థసారధి ఇటీవల పూణేలో నిర్వహించిన 50వ జాతీయస్థాయి కాన్ఫరెన్స్‌పై పేపర్ ప్రజెంటేషన్ ఇచ్చాడని దీనికి ఉత్తమ పేపర్ అవార్డుతో పాటూ రూ.5 వేలు నగదు అందజేశారన్నారు. ఈఈఈ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వి.జయంత్, పీ.భాను, కే.దీక్షిత ఇటీవల శశి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాజక్టు ఎక్స్‌పో కార్యక్రమంలో ప్రదర్శించిన ఎలక్ట్రికల్ వాహనాలలో తక్కువ ధర బ్యాటరీ, నిర్వహణ వ్యవస్థ, ఆరోగ్యస్థితి అంచనా ఆవిష్కరణకు తృతీయ స్థానాన్ని, రూ.5 వేలు నగదు అందుకున్నారన్నారు. ఈఈఈ విభాగాధిపతులు డాక్టర్ రఫీ మహ్మద్, డాక్టర్ టీ.రమేష్, ఆచార్యులు వీ.సందీప్, డాక్టర్ సునీల్ పాల్గొన్నారు.



క్లాప్ కొడుతున్న డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు

ఏలూరులో కొత్త సినిమా షూటింగ్ సందడి

ఏలూరు కల్చరల్, మార్చి 25: ఆర్వీ స్టూడియోస్ బ్యానర్‌పై నూతన నటీనటులతో నిర్మించనున్న ప్రొడక్షన్ నెంబర్‌వన్ చిత్రం ముహూర్తపు షాట్‌ను ఏలూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో తీశారు. నలుగురు స్నేహితుల మధ్య జరిగే సంఘటనా దృశ్యాలను చిత్రీకరించారు. డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విజయ్‌రాజు మాట్లాడుతూ మంచి టీమ్‌లో కుటుంబ నేపథ్యంలో మంచి సందేశాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్న ఆర్వీ స్టూడియోస్ అధినేత రవికుమార్‌ను అభినందించారు.సినీ నిర్మాత, దర్శకుడు, రచయిత దాసరి రవి కుమార్ మాట్లాడుతూ నూతన నటీనటులతో సినిమా తీస్తున్నట్లు చెప్పారు. రీజనల్ ఎంప్లాయిమెంట్ అధికారి రాయుడు రవికుమార్, తెలుగు చలనచిత్ర ప్రముఖులు వి.జయకుమార్, ప్రొడక్షన్ మేనేజరు శివ, డి.గణేష్, రాంబాబు, నాగశ్రీ, హరి, భాను, సాత్విక్, రాఘవ పాల్గొన్నారు.

పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లా ఏర్పాటు చేయాలి

సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్.రామ్మోహన్

బుట్టాయగూడెం, మార్చి 25 : పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు ఎస్.రామ్మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లాగా ఏర్పాటు చేశారని అదనంగా మన్యం జిల్లాను ఏర్పాటు చేశారన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్ కేంద్రాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలపడం వలన ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా కేంద్రమైన పాడేరు వెళ్ళాలంటే 200 కిలోమీటర్లు దూరం కావడం వలన ఆదివాసీలు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదన్నారు. రంపచోడవరం రెవిన్యూ డివిజన్‌లో ఉన్న మండలాలు, చింతూరు, కుక్కునూరు డివిజన్లలో కలిపి ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రధాన పార్టీలు వారి మేనిఫెస్టోలో పోలవరం కేంద్రంగా ఆదివాసీ జిల్లాను ఏర్పాటు చేస్తామని నిర్దష్టమైన హామీ ఇవ్వాలని, హామీ ఇచ్చినవారికే ఓటు వేస్తామన్నారు. అనాది నుంచి ఆదివాసీలు అన్యాయానికి, నిర్లక్ష్యానికి గురవుతూనే ఉన్నారన్నారు. 1917, 1956, 1970 చట్టాలు ఉన్నా రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతూనే ఉన్నాయని విమర్శించారు. హక్కులు, చట్టాలు, షెడ్యూల్ ప్రాంతం పరిరక్షణ కోసం గిరిజనులు పోరాడాలని తెలిపారు. ప్రత్యేక జిల్లా కోసం ముక్తకంఠంతో నినదించాలన్నారు.



బీజేపీ నాయకుడు రావూరి సుధ కారు ధ్వంసం

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదు..

పాలకొల్లు టౌన్, మార్చి, 25 : ఇంట్లో పార్కింగ్ చేసిన తన కారును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పాలకొల్లుకు చెందిన బీజేపీ నాయకుడు, కాకినాడ పార్లమెంట్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ రావూరి సుధ తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసి రెండు రోజులు గడుస్తున్నా ఎటువంటి స్పందన లేదన్నారు. సోమ వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22 రాత్రి 11 గంటల సమయంలో కారు పార్కింగ్ చేశామన్నారు. మరుసటిరోజు ఉదయం చూసేసరికి కారు వెనుక భాగం అద్దం పూర్తిగా ధ్వంసం అయి ఉందన్నారు. పార్కింగ్ స్థలంలో వరుసగా కార్లు ఉన్నాయనీ పసిగట్టుకుని తన కారును టార్గెట్ చేసి ధ్వంసం చేశా రన్నారు. ఇది రాజకీయ కక్షతో చేసిన పనే అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం కాకినాడ పార్లమెంట్ బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టానని తరుచూ కాకినాడ వెళ్లి వస్తున్నానన్నారు. తనకు తన కుటుంబానికి రక్షణ కావాలని కోరారు.

25-03-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్టం	కనిష్టం	సరాసరి
దేవరపల్లి	241	235	239.32
జంగారెడ్డిగూడెం-1	240	235	239.80
జంగారెడ్డిగూడెం-2	240	235	239.54
కొయ్యలగూడెం	241	235	239.77
గోపాలపురం	240	235	238.76

అమ్మో..రోడ్లా ఇవి..!

నరకానికి మార్గాలు

గజానికో గొయ్యి..అడుగుకో గుంత.. ఎటు వెళ్లినా గోతుల దారుల్లో అవస్థలు మాత్రం తప్పవు. జిల్లాలో ఉన్న ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గోతుల రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం చూస్తున్నామని వాహనదారులు లబోదిబోమంటున్నారు. ఈ ఐదేళ్లలో రోడ్ల ముఖం చూడని ప్రభుత్వం ఎన్నికలు దగ్గర పడుతుడండడంతో ఇటీవల కొన్ని ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి హడావుడిగా శంకుస్థాపనలు చేశారు.. రోడ్డు పనులు మాత్రం జరగలేదు...



గోతులమయంగా ప్రత్తిపాడు- అలంపురం రహదారి

శంకుస్థాపనలు కాదు..రోడ్లు వేయండి

పెంటపాడు, మార్చి 25 : మండలంలో రహదారులు అద్వానంగా తయారయ్యాయి. అప్పుడప్పుడు మరమ్మతులు చేసి చేతులు దులుపుకోవడం తప్ప ఈ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రోడ్లు వేసిన పరిస్థితులు లేవు. మండలంలో అలంపురం నుంచి ప్రత్తిపాడు వెళ్ళే రహదారి, ప్రత్తిపాడు ఫుడ్‌ప్యాట్స్ నుంచి రాచర్ల వెళ్ళే రహదారి, చింతపల్లి, కోరుమిల్లి, నుంచి బీ.కొండేపాడు వెళ్ళే రహదారి, దువ్వ వెంకయ్య ఒయ్యేరు నుంచి బీ.కొండేపాడు మీదుగా మీనవల్లూరు వెళ్లే రహదారి, కాశిపాడు నుంచి రావిపాడు వెళ్లే రహదారులు అధ్వానంగా మారడంతో ఆ దారిలో ప్రయాణం చేసేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆకుతీగపాడు నుంచి ముక్తేశ్వరం మీదుగా కే.పెంటపాడు వెళ్లే రహదారిని అధికారం చేపట్టిన నాటినుంచి పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు ఎన్నికలు వస్తుండటంతో ఇటీవల కొన్ని రోజుల క్రితం హడావుడిగా శంకుస్థాపనలు చేశారు. వల్లూరు పల్లి నుంచి రాచర్ల వెళ్ళే రహదారి పరిస్థితి కూడా ఇంతే.. దీనికి కూడా ఇటీవలే శంకుస్థాపనలు చేశారు. తమకు శంకుస్థాపనలు చేయడం కాదని రహదారులను మెరుగు పరిచి సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

సైకిళ్లు పంక్చర్లు పడుతున్నాయి..



పాలకొల్లు రూరల్ : మండలంలోని వరధనం గ్రామం నుంచి పెదమామిడిపల్లి మీదుగా చించినాడ బైపాస్ రోడ్డుకు వెళ్లే రహదారి పూర్తిగా కంకర లేచిపోయి అధ్వాన్నంగా తయారైంది. ఈ రోడ్డు వెంబడి నిత్యం వంద లాది మంది బైక్‌లు, సైకిళ్లపై ప్రయాణిస్తుంటారు. ఈరోడ్డు మీదుగా పెద మామిడిపల్లి నుంచి పాలకొల్లు పట్టణానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు సైకిళ్లపై వచ్చి వెళుతుంటారు. గోతుల రోడ్లపై సైకిల్ టైర్లు పంక్చర్లు కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు.

అధ్వాన రహదారులతో అవస్థలు



యలమంచిలి : మండలంలోని మేడపాడు, నేరేడుమిల్లి, రావిపాడు గ్రామాల మధ్య ప్రధాన రహదారి గోతులు ఏర్పడి, చాలాచోట్ల కంకరరాళ్లు పైకిలేచి ఉండటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సుమారు ఆరు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ రహదారి గోతుల మయంగా ఉండటంతో రాకపోకలు సాగించేవారు ఇక్కట్లు పడుతున్నారు. యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాలకు అనుసంధానంగా ఉన్న ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిలో కంకరరాళ్లు పైకి తేలడంతో ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతు న్నామని వాహనదారులు వాపోతున్నారు. ఐదేళ్లుగా ఈ రహదారిని పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు సుమారు వారం రోజుల క్రితం రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం గమనార్హం. మేడపాడు, యలమంచిలి, చించినాడ, ఏనుగువానిలంక, నవరసపురం గ్రామాల మధ్య రహదారి అధ్వా న్నంగా మారింది. ఈ మార్గంలో పెద్దఎత్తున గోతులు ఏర్పడటం, పలుచోట్ల రహదారి కుంగిపోవడంతో రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడు తున్నారు. సుమారు రెండున్నరేళ్ల క్రితం రూ.4 కోట్లతో ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించారు. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారు.



అధ్వానంగా యలమంచిలి - చించినాడ రహదారి



ప్రయాణం.. నరకప్రాయం

లింగపాలెం: లింగపాలెం మండలంలోని రోడ్లు దారుణంగా తయారయ్యాయి. రాళ్లు లేచి కంకర బయటపడటంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్ళే ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా తయారడంతో ప్రయాణం నరకప్రాయంగా ఉందంటూ గ్రామస్థులు వాపోతున్నారు. రోడ్లు పాడైపోవడంతో కొద్దిపాటి వర్షాలు కురిసినా రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

అధ్వానం భీమవరం-గుడివాడ రోడ్డు

కాళ్ళ : కాళ్ల మండలంలోని ప్రధాన రహదారి భీమవరం-గుడివాడ రాష్ట్రీయ రహదారి అధ్వానంగా తయారైంది. మండల పరిధిలో సుమారు 20 కిలోమీటర్లు పొడవునా ఉండే ఈ రహదారి అడగడుగునా గోతులమయంగా ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోపల్లె, జక్కరం, కాళ్ళ, దొడ్డనపూడి, ఏలూరుపాడు తదితర గ్రామాల వద్ద పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి.

భీమవరం - గుడివాడ రహదారి దుస్థితి



ఈ ఐదేళ్లలో ఒక్క రోడ్డూ వేయలేదు

జంగారెడ్డిగూడెం, మార్చి 25 : గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అత్యంత దారుణంగా తయారయ్యాయని చింతలపూడి నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని చక్రదేవరపల్లి గ్రామ రహదారిని చూసి ఆయన స్పందించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలైనా ప్రయాణికుల సౌకర్యార్థం ఒక్క రోడ్డు కూడా నిర్మించలేదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే చింతలపూడి నియోజకవర్గంలో ఉన్న రహదారులన్నీ నిర్మిస్తామన్నారు.



చక్రదేవరపల్లి రోడ్డులో గుంతలను చూపుతున్న రోషన్‌కుమార్

సోమేశ్వరస్వామికి పంచదారతో అభిషేకం



భీమవరంటౌన్, మార్చి 25 : పౌర్ణమి పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడి సోమేశ్వరస్వామివారిని పంచదారతో అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పంచదారతో అభి షేకం చేసి అలంకారం చేశారు.ఈవో రామకృష్ణంరాజు, ధర్మకర్తలు పర్యవేక్షించారు.

ఘనంగా డోలా పౌర్ణమి మహోత్సవం



ద్వారకాతిరుమల, మార్చి 25 :డోలా పౌర్ణమి పురస్కరించుకుని తొళక్క వాహనంపై ఉభయ దేవేరులతో కొలువు దీరిన శ్రీవారు సోమవారం ఉదయం సాయంత్రం తిరువీధుల్లో ఊరేగారు. తొలుత స్వామి అమ్మ వార్లను తొళక్క వాహనంపై ఉంచిన వాహ నాన్ని అలంకరించారు. అనంతరం అర్చకులు స్వామివారికి హారతులు అంద జేశారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీవారి వాహనం తిరువీధుల్లో ఊరేగింది.

జీఎస్ఎల్‌లో జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ పోటీలు



రాజమహేంద్రవరం, మార్చి 25: కత్తి యుద్ధం ఏషియన్ గేమ్స్‌లో కాంస్య పతకం సాధించిన యోధురాలు (ఫెన్సర్) మొదటి భారతీయ వనిత సీఏ భవానీదేవిని స్ఫూర్తిగా తీసుకుని ఫెన్సింగ్ (కత్తి యుద్ధం)క్రీడలో నైపుణ్యాలు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు పిలుపు నిచ్చారు. యువజన, సాంస్కృతికశాఖ, ఎఫ్ఏఏపీ (ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) ఆధ్వర్యంలో 25వ జాతీయ సబ్ జూనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్ పోటీలు రాజానగరం జీఎస్ఎల్ ప్రాంగణంలో సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నన్నయ వీసీ పద్మరాజు, జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల మెంటార్ డాక్టర్ గన్ని భాస్కరావు పోటీలను ప్రారంభించారు. సీనియర్ నేషనల్ ఫెన్సర్, ఎఫ్ఏఏపీ రాష్ట్ర కార్యదర్శి జీఎస్వీ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి 10 నుంచి 14 ఏళ్ల వయసున్న 250 మంది బాలికలు, 271 మంది బాలురు, 160 మంది కోచ్‌లు, మేనేజర్లు, టెక్నీషియన్లు హాజరైనట్టు చెప్పారు. మాజీ సెక్రటరీ, అసోసియేషన్ మెంటార్ ఎస్.సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఇద్దరి మధ్య 3 నిమిషాలు వంతున నిమిషం వ్యవధితో వెంట వెంటనే మూడుసార్లు పోటీ ఉంటుంద న్నారు. 15 పాయింట్లు సాధించిన వారు విజేతలని, పోటీల్లో నైపుణ్యాలను కచ్చితంగా గుర్తించడానికి ఎలక్ట్రానిక్ పరికరాలు ఉపయోగిస్తున్నామని విజేతలకు బంగారు, వెండి, కాంస్య పతకాలు బహుమతులుగా అందజేయనున్నట్టు చెప్పారు.

క్రైం కార్నర్



బోల్తా కొట్టిన ప్రమాదానికి కారణమైన కారు



సత్యనారాయణ(ఫైల్)

కారు ఢీకొని హోటల్ యజమాని మృతి

కూతురు, సోదరికి తీవ్రగాయాలు

పెదవేగి, మార్చి 25 : మద్యం సేవించి వాహనాలు నడపరాదంటూ పోలీసులు ఎంతగా హెచ్చరిస్తున్నా వారి మాటలు పెడచెవిని పెడుతూనే ఉన్నారు. ప్రమాదాలకు కారణమవుతూనే ఉన్నారు. పెదవేగి మండలం చక్రాయగూడెంలో ఆదివారం రాత్రి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పెదవేగి ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం వేగివాడకు చెందిన మారగాని సత్యనారాయణ వేగివాడ సెంటర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు.ఆదివారం రాత్రి పదకొండు గంటల సమయంలో కొంతమంది టిఫిన్ చేశారు. బిల్లు రూ.150 కాగా ఫోన్ పేలో రూ.15 చెల్లించి వెళ్లిపోయారు. దీంతో సోదరి మణి, కుమార్తె పురంధరేశ్వరితో సత్యనారాయణ బైక్‌పై వారిని కొంతదూరం వెంబడించి తిరిగి వేగివాడ వస్తున్నారు. అదే సమయంలో ఏలూరు వైపు నుంచి వస్తున్న కారు వేగంగా వీరి బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టి వందమీటర్లకు పైగా ఈడ్చుకెళ్ళింది. ఈ ప్రమాదంలో సత్యనారాయణ (48) అక్కడికక్కడే మృతి చెందగా, అతని సోదరి మణి, కుమార్తె పురంధరేశ్వరి తీవ్ర గాయాలపాలయ్యారు. కొంత మంది గ్రామస్థులు ఆ కారును వెంబడించగా దెందులూరు మండలం చల్లచింతలపూడి దగ్గరలో పోలవరం కాలువలో బోల్తా పడింది. గ్రామస్థులు కారును నడుపుతున్న తడికలపూడికి చెందిన శిరుగుబత్తుల నవీన్ అనే యువకుడితో పాటు కారులో ఉన్న మరో ఇద్దరు యువకులను పట్టుకుని పెదవేగి పోలీసులకు అప్పగించారు. కారు కాంగ్రెస్ పార్టీకి చెందిన కావూరి లావణ్యకు చెందినదిగా చెప్తున్నారు. కారులో ఉన్న ముగ్గురు యువకులు మద్యం మత్తులో ఉన్నట్లుగా గ్రామస్థులు తెలిపారు. మృతుడు సత్యనారాయణకు తొమ్మిదో తరగతి చదువుతున్న కుమార్తె పురంధరేశ్వరితో పాటు దివ్యాంగుడైన పదో తరగతి చదువుతున్న కుమారుడు ఉన్నారు. చిన్నతనం నుంచి కష్టపడి కుటుంబాన్ని పోషించిన అతని కుటుంబం ఈరోజున దిక్కుతోచని పరిస్థితిలో పడి పోయిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు.

మృతదేహంతో రాస్తారోకో



ప్రమాదానికి కారణమైన కారుకు సంబంధించిన వారు సోమవారం సాయంత్రం వరకు కూడా స్పందించకపోవడంపై ఆగ్రహించిన గ్రామస్థులు సోమవారం సాయంత్రం నాలుగుగంటల నుంచి మృతదేహంతో ఏలూరు- జంగారెడ్డిగూడెం రహదారిపై రాస్తారోకో చేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇంత జరిగినా కావూరి లావణ్య రాక పోవడం ఏమిటని, ఆమె వచ్చేంతవరకు రాస్తారోకో ఆపేది లేదని భీష్మించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రాజేంద్రప్రసాద్ మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

చెర్వులో పడి యువకుడి మృతి



ఉంగుటూరు, మార్చి 25 : ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామ పరిధిలోని కోటవాని చెర్వులో ఒక యువకుడు మృతి చెందినట్టు చేబ్రోలు పోలీసులు తెలిపారు. నిడమర్రు మండలం చిన నింద్రకొలను వాసి రావూరి సాయికుమార్ ప్రేమ వివాహం చేసుకుని ఉంగుటూరు మండలం సీతారాంపురంలో వడ్రంగి పని చేసుకుని జీవిస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిస కావడంతో మానసికంగా ఇబ్బంది పడుతూ చెర్వులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు చేబ్రోలు ఎస్ఐ మణికుమార్ తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బాలుడు అరెస్టు..7.50 లక్షలు స్వాధీనం

ఆకివీడు, మార్చి 25: అనాధ అని చేరదీస్తే వారి ఇంట్లోనే చోరీ చేసిన బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే సోమవారం ఆకివీడు రైల్వేస్టేషన్ దగ్గర అదుపులోకి తీసుకొని రూ.7.50 లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మందపాడుకు చెందిన రొయ్యల వ్యాపారి ముద్దే వెంకట దుర్గా ప్రసాద్, దూదిగామ రాంబాబులకు వారం రోజులు క్రితం పదహారేళ్ళ బాలుడు ఊరులో కనబడ్డాడు. అనాధనని చెప్పడంతో చేరతీసి భోజనం పెడుతున్నారు. అయితే ఆదివారం దుర్గాప్రసాద్, భార్య బయటకు వెళ్ళడంతో ఆ బాలుడు ఇంటి తాళాలు పగలకొట్టి నగదు కాజేసిన సంగతి తెలిసిందే. బాలుడిని అరెస్టు చేసి ఏలూరులోని జువెనైల్ హోమ్‌కి తరలించామని సీఐ సత్యనారాయణ, ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు.

ఉరి వేసుకుని వివాహిత మృతి



మృతి చెందిన ఉషారాణి

పెదపాడు, మార్చి 25 : పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన వివాహిత చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన ఘటనపై పెదపాడు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వసంతవాడ గ్రామానికి చెందిన పోలగాని నాగరాజుతో ఉషారాణి (27)కి ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగు సంవత్సరాల పాప ప్రియాంక, మూడు సంవత్సరాల బాబు లోకేష్ ఉన్నారు. తాపీపనులు చేసే నాగరాజు తరచూ తాగివచ్చి ఉషారాణితో తగాదా పడేవాడు. 24వ రాత్రి మరలా గొడవ జరిగినట్లు పోలీ సులు తెలిపారు. 25వ తేదీన ఉదయం ఇంటి ఎదురుగా వున్న మామిడిచెట్టు కొమ్మకు ఉరి వేసుకుని కన్పించడంతో కుటుంబసభ్యులు పెదపాడు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జి ఎస్సై కె.స్వామి (దెందులూరు) అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయాలు.. ముగ్గురి అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 25 : ఏలూరు నగరం, రూరల్ ప్రాంతాల్లో మద్యం కల్గి ఉన్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వంగాయిగూడెం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో సాయినగర్‌కు చెందిన జోగి జయరాజు ఏడు బీరు బాటిల్స్‌ను కల్గి ఉన్నాడు. దీంతో అతనిని సోమవారం సాయంత్రం రూరల్ ఎస్ఐ రాజారెడ్డి అరెస్టు చేశారు. ఏలూరు పత్తేబాద మంచినీటి తోటకు చెందిన కాలెపు ఉమా మహేశ్వరరావు నాలుగు మద్యం బాటిల్స్‌ను కల్గి ఉండి ఏలూరు సమీపంలోని సత్రంపాడు సెంటర్ వద్ద విక్రయిస్తున్నాడు. దీంతో ఏలూరు త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. పెదపాడు మండలం సీతారామపురానికి చెందిన పసుపులేటి నాగరాజు ఏలూరు సత్రంపాడు సెంటర్ వద్ద నాలుగు మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తుండగా త్రిటౌన్ సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు.

మహిళపై దాడి.. ఒకనిపై కేసు నమోదు



గాయాలకు గురైన అచ్యుత కుమారి

ఏలూరు క్రైం, మార్చి 25 :వేంకటేశ్వరస్వామి దేవా లయంలో జరిగే కల్యాణ మహోత్సవాల ఏర్పాట్లలో పాత కార్యవర్గానికి, కొత్త కార్యవర్గానికి మనస్పర్థలు ఏర్పడి మహిళా కార్యదర్శిపై ఒక వ్యక్తి దాడి చేసి గాయపరిచాడు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు కండ్రిక గూడెం లోని రాజరాజేశ్వరి నగర్‌లో ఉన్న వేంకటేశ్వర ఆలయ కమిటీ కార్యదర్శిగా సావన్ అచ్యుత కుమారి వ్యవహ రిస్తున్నారు. ఆదివారం రాత్రి కల్యాణ ఏర్పా ట్లను ఆమె పర్యవేక్షిస్తున్నారు. కమిటీకి చెందిన రెడ్డినాగ రాజు ఆమెతో గొడవ పెట్టుకుని ఒక్కసారిగా రాడ్డుతో తలపై కొట్టాడు. తీవ్రగాయాలపాలైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో ఆమె కుమారుడు చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు రెడ్డి నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి.. పదిమంది అరెస్ట్

మండవల్లి, మార్చి 25: మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం డొంకలో పేకాడుతున్న 10 మంది జూదరులను మండవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,900లు నగదు, 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.

గడ్డివాము, పశువులపాక దగ్ధం

కైకలూరు, మార్చి 25: పశువులపాక, గడ్డివాము దగ్ధమై రూ.10 వేల ఆస్తినష్టం జరిగింది. సోమవారం రాత్రి కైకలూరులోని పెద్దమసీదు వెనుక తిరుమాల సత్యనారాయణకు చెందిన పశువుల పాక, గడ్డివాముకు ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసి పాకలో ఉన్న ఒక ఆవు, రెండు గేదెలను రక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

రెడ్డిగణపవరంలో ఘనంగా కనకదుర్గమ్మ ఉత్సవాలు


కనకదుర్గమ్మను దర్శించుకున్న భక్తులు

బుట్టాయగూడెం, మార్చి 25: రెడ్డిగణపవరంలో కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారిని దర్శించుకోడానికి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిర్లు, క్యూలైన్లను ఏర్పాటుచేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవార్లకు, స్వామి వారికి ఆలయ కమిటీ నూతన వస్త్రాలు సమర్పించింది. ఐదు రోజులు ఏజెన్సీ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. అమ్మవారి చెంత మూడు రాత్రులు జాగారం చేస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

బంగారమ్మపేటలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ


సీతా రామ లక్ష్మణ హనుమ విగ్రహాలు

పోలవరం, మార్చి 25: పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేటలో నిర్మించిన రామాలయంలో సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడి విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, గోపూజ, మండప ఆరాధన, గణపతి హోమం, యంత్ర ప్రతిష్ఠ కళాన్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం శ్రీరామచంద్రుడి విగ్రహ, ధ్వజ స్థంబ ప్రతిష్ఠ, సీతారామ కల్యాణం నిర్వహించారు. అర్చకులు ర్యాలి భావన్నారాయణ శేఖర శర్మ పూజలు చేయించారు. భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సబ్బారపు శ్రీరామ్మూర్తి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సౌభాగ్యలక్ష్మి ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సౌభాగ్యలక్ష్మి

ఏలూరు కార్పొరేషన్, మార్చి 25: ఏలూరులో సౌభాగ్యలక్ష్మి అమ్మవారికి సోమవారు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అగ్రహారంలోని జనార్ధనస్వామి, రంగనాయకస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి లక్ష మల్లెలతో అర్చన చేశారు. అర్చకుడు వంగల పవన కుమారాచార్యులు, వెంకటాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఆలయ ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు, సిబ్బంది కృష్ణ, భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

దత్తపీఠంలో మహాలక్ష్మీ యాగం


వేదికపై లక్ష్మీదేవి అమ్మవారు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 25: శ్రీలక్ష్మీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని దొండపాడు దత్తనాథ క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సామూహికంగా లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణ చేశారు. నిర్వహించారు. లక్ష్మీగణపతి, నవగ్రహ నక్షత్ర, మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు లక్ష్మీదేవిని దర్శించుకున్నారు. దత్త పీఠం ప్రధాన అర్చకులు రామకృష్ణ భక్తులతో పూజలు, నోములు, వ్రతాలు, హోమాలు జరిపించారు.

ఆదివాసీల సంప్రదాయ కొలుపు పండుగ


పండుగ నిర్వహిస్తున్న ఆదివాసీలు

కుక్కునూరు, మార్చి 25: మండల పరిధిలోని ఉప్పేరు రెడ్డిగూడెంలో సోమవారం ఆదివాసీల సంప్రదాయ కొలుపు పండుగ జరుపుకున్నారు. డోలు, సన్నాయి మేళాలతో కోలాహలంగా గ్రామ దేవతలకు పూజలు జరిపారు. అనాది నుంచి వస్తున్న పండుగను ప్రతి ఏడాది నిర్వహిస్తున్నట్టు ఆదివాసీలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు సరియం ప్రసాద్, సంజీవరావు, పూజారులు పుల్లయ్య రామారావు, దుర్గ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు గ్రామాభివృద్ధికి సహకరించాలి


పురస్కారాలు అందుకున్న మహిళలు

టి.నరసాపురం, మార్చి 25: విద్యావంతులైన మహిళలు గ్రామాభివృద్ధికి సహకరించాలని బంజారా బజరంగీ భేరి జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ తెలిపారు. కృష్ణాపురంలో బంజారా బజరంగీ భేరీ సంఘం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన వివిధ రంగాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న 15మంది మహిళలకు క్రాంతి బాయి పురస్కారాలు సోమవారం అందజేశారు. ముందుగా హనుమాన్ జెండాను మాజీ సర్పంచ్ జరభల పూర్ణయ్య, కమిటీ అధ్యక్షుడు చందా నాయక్ ఆవిష్కరించారు. జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ చదువుకున్న మహిళలు గ్రామంలో యువతను చైతన్యపథంలో నడపాలన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయక్, బిగనాథం నాయక్, మురళీ నాయక్, బాబురావు నాయక్, గాంధీ నాయక్, కృష్ణ నాయక్, రమేష్‌బాబు, స్వామి, సత్యం పాల్గొన్నారు.

7న ఘంటసాల గాన వినోదం

ఏలూరు రూరల్, మార్చి 25: ఉగాది సందర్భంగా ఘంటసాల స్వర పీఠం ఆధ్వర్యంలో ఎస్ఎం సుభానీ సారధ్యంలో ఏప్రిల్ 7న ఘంటసాల గాన వినోదం పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఘంటా వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమ కరపత్రాలు సోమవారం ఆవిష్కరించారు. ఘంటసాల ఆలపించిన పాటలు ఎంతో విలువను పెంచాయని, అటువంటి తెలుగు పాటల మాధుర్యాన్ని ఈనాటి తరానికి అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సుభానీ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి వై.అర్జున్‌రావు, అసిస్టెంట్ కార్యదర్శి శ్రీవల్లీ, మహ్మద్ ఖాజావలీ, రాజేష్‌మీనన్ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వారితో అభివాదం చేస్తున్న చింతమనేని


జంగారెడ్డిగూడెంలో రోషన్‌కుమార్‌కు నేతల స్వాగతం


ఏలూరులో సమస్యలు తెలుసుకుంటున్న బడేటి చంటి



పుట్టా మహేష్‌ను కలిసిన చిర్రి బాలరాజు, మండల నేతలు

రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలి

టీడీపీలో చేరికలు.. అభ్యర్థుల ప్రచారం

పెదవేగి, మార్చి 25: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని, అవస్థల పాల్జేసిన వైసీపీకి ప్రజలే గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏలూరు రూరల్ మండలాల్లోని పైడి చింతపాడు, పత్తికోళ్ళలంక, గుడివాకలంక, మొండికోడు గ్రామాల నుంచి వైసీపీకి చెందిన సుమారు 200 మంది కుటుంబాలతో సహా చింతమనేని ప్రభాకర్, ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. దుగ్గిరాలలో జరిగిన కార్యక్రమంలో వారికి చింతమనేని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రం అన్నివిధాల వెనుకబడి ఉందని, తిరిగి రాష్ట్రం ఆర్థికంగా బలోపేతం కావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించడానికి అందరూ కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే మరడాని రంగారావు, పార్టీ నాయకులు మోరు శ్రావణి దశరథ్, తాతా సత్యనారాయణ, నంబూరి నాగరాజు, బొప్పన సుధాకర్, లావేటి శ్రీనివాసరావు, సైదు సత్యనారాయణ, పలువురు కొల్లేటి గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: సూపర్ సిక్స్ పథకాలతో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చింతలపూడి నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. 12, 13, 14వ వార్డుల్లో సోమవారం రోషన్ కుమార్ పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. రానున్నది ప్రజా ప్రభుత్వమని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా టీడీపీ పాలన సాగుతుందన్నారు. ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనమైందని, టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మండవ లక్ష్మణరావు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, రావూరి కృష్ణ, తూటిగుంట దుర్గా రావు, పాతూరి అంబేడ్కర్, బొబ్బర రాజ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరు: రాష్ట్రంలో వైసీపీ నాయకుల భూదాహానికి చేనేత కుటుంబాలు బలయ్యాయని, దీనికి ముఖ్యమంత్రి జగన్ బాధ్యత వహించాలని ఏలూరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి డిమాండ్ చేశారు. విద్యానగర్ పిండిమర సెంటర్ నుంచి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్రలో ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వ డ్రగ్ మాఫియా రాష్ట్రంలో యువత భవితను చిదిమేస్తోందన్నారు. విశాఖను స్టేట్ క్యాపిటల్‌గా మారుస్తామని ప్రగల్భాలు పలికిన సీఎం జగన్ దాన్ని డ్రగ్ క్యాపిటల్‌గా మార్చివేశారని ధ్వజమెత్తారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ గూడవల్లి శ్రీనివాస్, రెడ్డి రామకృష్ణ, కడియాల విజయలక్ష్మి, చేకూరి గణేష్, మట్ట రంజిత్, తెలుగుదేశం పార్టీ నాయకులు లంకపల్లి మాణిక్యాల రావు, మందపల్లి అబ్రహం పాలస్, కడిమి రమేష్, వేమూరి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు ఘన స్వాగతం

పెదపాడు: ఎన్‌డీఏ కూటమి ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌కు అప్పనవీడు అభయాంజనేయస్వామి ఆలయం వద్ద మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఘన స్వాగతం పలికారు. పుట్టా మహేష్ యాదవ్ అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భారీ ర్యాలీగా ఏలూరు జిల్లా పార్టీ కార్యాలయానికి తరలివెళ్లారు.

● పోలవరం: ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను పోలవరం నియోజకవర్గ కూటమి జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు, నాయకులు సోమవారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. బాలరాజు మాట్లాడుతూ కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పనిచేసి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ నిర్విరామంగా కృషి చేయాలన్నారు. కరాటం సాయి, గడ్డమనుగు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● లింగపాలెం: మండలం నుంచి పలువురు టీడీపీ నేతలు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ను కలిశారు. అత్యధిక మెజార్టీతో గెలిపించేలా తాము సిద్ధంగా ఉన్నామన్నారు. గరిమెళ్ళ చలపతిరావు, బలుసు శ్రీనివాస్, పిల్లల శ్రీనివాస్‌యాదవ్, పలువురు తెలుగుదేశంపార్టీ, బీజేపీ, జనసేన నాయకులు కలిశారు.

కూటమి అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

టి.నరసాపురం: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థి చిర్రి బాలరాజు విజయానికి కృషి చేయాలని జనసేన మండల అధ్యక్షుడు అడపా నాగరాజు కోరారు. శ్రీరామవరంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. టీడీపీ, బీజేపీ నాయకులతో ఎన్నికల కార్యాచరణపై చర్చించినట్లు ఆయన తెలిపారు. కార్యకర్తలందరూ కూటమి అభ్యర్థి విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పూనెం ఆదిత్య, జట్ల రాంబాబు, మద్యాహ్నపు చిన వెంటారావు, చింతలపూడి నవీన్ పాల్గొన్నారు.

● భీమడోలు: పోలసానపల్లిలో టీడీపీ, జనసేన ఎన్నికల ప్రచారం నిర్వహించింది. మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు, ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు, తెలుగుదేశం కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు, నాయకులు గ్రామంలో ఇంటింటికి కూటమి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో గ్లాసు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వేడుకున్నారు. జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● గణపవరం: మొయ్యేరులో 30 మందికి ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు జనసేన పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మూడు పార్టీల కార్యకర్తలు సమన్వయంతో ప్రచారం చేయాలని పవన్ కల్యాణ్ ఆశయం నెరవేర్చాలని కోరారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, కానుమిల్లి చంటి, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, కొల్లేపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


జీలుగుమిల్లి చెక్‌పోస్టు వద్ద ఆర్వో సూర్యతేజ తనిఖీ



కె.కోట మండలం కొత్తూరులో డీఎస్పీ రవిచంద్ర, కుక్కునూరులో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ

ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జీలుగుమిల్లి, మార్చి 25 : ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పోలవరం ఆర్వో, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అన్నారు. జీలుగుమిల్లి చెక్‌పోస్టును సోమవారం ఆయన పరిశీలించారు. ఆర్టీసీ బస్ ఆపి సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. మద్యం, తాయిలాలు, నగదు అక్రమ రవాణా నిరోధించాలన్నారు. వాహనాల రాకపోకలపై చెక్‌పోస్ట్ సిబ్బంది నిఘా ఉంచాలన్నారు.

● కామవరపుకోట: కొత్తూరులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో తడికలపూడి ఎస్ఐ జయబాబు, సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రూ.50 వేల మొత్తం తీసుకు వెళ్లడానికి తగిన ఆధారాలు ఉండాన్నారు. మద్యం, నగదు అక్రమ రవాణాపై ఫ్లయింగ్ స్క్వాడ్‌కు, తమకు సమాచారం ఇవ్వాలన్నారు.

● కుక్కునూరు: కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్ తనిఖీ నిర్వహించారు. కుక్కునూరు ప్రధాన రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఐటీడీఏ అడిషనల్ పీడీ నాగేశ్వర రావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు.

ఎన్నికల నియమావళి పాటించాలి

లింగపాలెం: ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో రాంబాబు అన్నారు. వాహనాలను అధికారులు, ఎన్నికల సిబ్బంది తనిఖీ చేస్తారని, రూ.50వేలకు పైబడిన నగదు తీసుకువెళ్ళేటప్పుడు వాటికి సంబంధించిన రశీదులు కూడా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడానికి మద్యం, ఇతర సామగ్రి తీసుకువెళితే సీజ్ చేస్తామన్నారు. నిబంధన ఉల్లంఘన గుర్తిస్తే సివిజిల్ అనే యాప్ ద్వారా పంపిస్తే వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు.

శిలాఫలకాలపై దివంగత నేతల పేర్లు..

ఏలూరు కలెక్టరేట్: ఎన్నికల నియమావళి మేరకు శిలాఫలకాలపై దివంగత నేతల పేర్లను తొలగించాల్సిన ఆవశ్యకత లేదని ఆర్వో ఎం.ముక్కంటి తెలిపారు. ఎన్నికల నియమావళి మేరకు కార్యాలయాల్లో పోస్టర్లను తొలగించామని, కోడ్ ఉల్లంఘనలపై ఎంసీసీ బృందాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నాయని ఆయన తెలిపారు.

హీరో మెగా సర్వీస్ కార్నివాల్‌కు విశేష స్పందన


కొత్త వాహనం అందజేస్తున్న సుమన్‌బాబు

ఏలూరు క్రైం, మార్చి 25: పేరయ్య కోనేరు మైదానంలో సాయిస్వర్ణ హీరో షోరూమ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హీరో మెగా సర్వీస్, ఎక్స్ఛేంజ్ కార్నివాల్‌కు విశేష స్పందన లభించిందని హీరో మోటార్ కంపెనీ ఏపీ ఏరియా మేనేజర్ విజయ్‌కన్నన్, ఏపీ ఏరియా సర్వీస్ మేనేజర్ ఎస్ గోపాల్‌కృష్ణ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలని మానసిక వత్తిళ్లలను దూరం చేయడానికి మెగా కార్నివాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. హీరో వాహనదారుల ఆరోగ్యాన్ని కాపాడడం కోసం సామాజిక బాధ్యతగా వైద్య శిబిరం ఏర్పాటుచేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. మంగళవారం మెగా కార్నివాల్ క్యాంపు ముగిస్తుందని, ఏలూరు, పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పి.కృష్ణ కిరీటి, కైలాస్, సాయిస్వర్ణ షోరూమ్ ఎండి సుమన్‌బాబు, జనరల్ మేనేజర్ సోమేశ్వరరావు, టెరిటరీ సర్వీస్ మేనేజర్ మనోజ్ కుమార్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

జేఎన్‌యూ విద్యార్థి ఎన్నికల్లో ఫాసిస్టుల ఓటమి

జంగారెడ్డిగూడెం, మార్చి 25: న్యూఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఎన్నికల్లో ఫాసిస్టు శక్తులను ఓడించిన విద్యార్థులు విజయం సాధించడంపై పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ హర్షం వ్యక్తం చేశారు. బీజేపీకి, దానికి వత్తాసు పలుకుతున్న ఏబీవీపీకి ఈ ఫలితాలు చెంపపెట్టని వారు పేర్కొన్నారు. నకిలీ దేశభక్తి ప్రదర్శిస్తూ కార్పొరేట్ విధానాలను బీజేపీ అవలంబించిందన్నారు.

కుక్కల దాడిలో ఒకరికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న బాధితుడు

పోలవరం, మార్చి 25: పోలవరం పంచాయతీ యడ్లగూడెంలో వీధి కుక్కల దాడితో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలవరం బీసీ కాలనీకి చెందిన అల్లు రాఘవులు సోమవారం మోటారు బైకుపై కృష్ణారావుపేట గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా యడ్లగూడెం జంక్షన్ చికెన్ షాపుల సమీపంలో వీధి కుక్కలు వెంటపడ్డాయి. కిందపడిన తనపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటు వాక్సిన్ వేయించుకుని చికిత్స పొందినట్లు తెలిపారు. మండల కేంద్రంలో కన్నాపురం అడ్డ రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకూ రోడ్డుకిరువైపులా చికెన్ దుకాణాలు ఉండడంతో వీధి కుక్కలు మందలుగా స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారుల వెంటపడుతున్నాయి. పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని, వెంటనే స్పందించి చికెన్ దుకాణాలను సంత మార్కెట్‌లోకి తరలించాలని, కుక్కల్ని పట్టించి దూరంగా వదిలి వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్చరీలో యుక్తశ్రీకి బంగారు పతకం

నూజివీడు టౌన్, మార్చి 25: ఆర్చరీ విభాగంలో నూజివీడుకు చెందిన యువతి బంగారు పతకాన్ని సాధించింది. కొండపావులూరి సాయి వెంకటగిరి కుమార్తె యుక్తశ్రీ చెన్నైలో ఈ నెల 23, 24 తేదీల్లో ఎన్టీపీసీ సౌత్ జోనల్ ఓపెన్ ఆర్చరీ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరిన వైసీపీ నాయకురాలు సృజన


సృజనను ఆహ్వానించిన షర్మిల

బుట్టాయగూడెం, మార్చి 25: వైసీపీకి చెందిన దువ్వెల సృజన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. సృజన వైసీపీలో క్రియాశీలకంగా ఉంటున్నారు. పోలవరం ఎస్టీ నియోజకవర్గం అసెంబ్లీ సీటును ఆశించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డికి తన బయోడేటాను పంపి అవకాశం ఇవ్వాలని కోరారు. చివరికి ఆమెకు నిరాశ ఎదురైంది. కరోనా సమయంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్ర ఎస్టీ సెల్ నాయకురాలిగా ఉంటున్నారు. సృజన కాంగ్రెస్ పార్టీలో చేరడం ఏజెన్సీలో చర్చనీయంశంగా మారింది. బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రికి చెందిన ఆమె డిగ్రీ చదివారు. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో ఉన్నారు. విద్యావంతురాలైన ఆమె నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధం ఉన్నట్లు తెలిపారు. వైసీపీలో ఎంతగా కష్టపడినా గుర్తింపు లేకపోవడంతో పార్టీని వీడినట్లు ఆమె తెలిపారు.

ఉపాధి లేక యువత వలస పోతున్నారు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఉపాధి అవకాశాలు



పెదవేగి, మార్చి 25: రాష్ట్రంలో ఐదేళ్లుగా అరాచక పాలన సాగుతోందని, ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గ కన్వీనర్ ఆలపాటి నరసింహమూర్తి అన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వస్తే యువత ఉపాధి అవకాశాలే లక్ష్యంగా పరిశ్రమల స్థాపన, సంపద సృష్టికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. పెదవేగి మండలం ముండూరులో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే రాష్ట్రం ఈరోజు ఇలాంటి దుస్థితిలో ఉండేది కాదన్నారు. సీఎంగా జగన్ పూర్తిగా విఫలమయ్యాడని, ఏ ఒక్కవర్గంకూడా సంతోషంగా ఉన్నామని చెప్పే పరిస్థితి లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా వైఎస్.షర్మిల బాధ్యతలు చేపట్టిననాటినుంచి కాంగ్రెస్‌పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతూ వస్తోందని, దీనికి నిదర్శనం చింతలపూడి వైసీపీ ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా కాంగ్రెస్‌పార్టీలో చేరడమేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే చాలామంది కాంగ్రెస్‌పార్టీలో చేరడానికి సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల నాటికి కాంగ్రెస్‌పార్టీ మరింతగా పుంజుకుంటుందని, ఇదే స్ఫూర్తితో వచ్చే ఎన్నికల్లో పోటీ చేసి, విజయం దిశగా ముందుకెళ్తామని ఆలపాటి పేర్కొన్నారు.

వైసీపీకి సర్పంచ్ యువరాజు రాజీనామా

చింతలపూడి, మార్చి 25: చింతలపూడి మండలం ఉర్లగూడెం సర్పంచ్ కొండుబోయిన యువరాజు, పంచాయతీలోని 9 మంది వార్డు సభ్యులు వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు సోమవారం తెలిపారు. గ్రామంలో 500 మందితో సమావేశం జరిపి నిర్ణయం తీసుకున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఎటువంటి అభివృద్ధి లేదని, పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు లేదని, అవమానాలకు గురికావాల్సి వస్తోందని చెప్పారు. త్వరలో తెలుగుదేశంపార్టీలో చేరనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

భువనేశ్వరి పర్యటన విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం, మార్చి 25: నారా భువనేశ్వరి పర్యటన విజయవంతం చేయాలని తెలుగు మహిళ ఆర్గనైజింగ్ కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి కోరారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు జైలులో ఉన్నప్పుడు మనస్తాపంతో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించడానికి ఆమె మంగళవారం కొయ్యలగూడెం మండలంలో పర్యటిస్తున్నారని, ఆ పర్యటనకు తెలుగు మహిళలంతా హాజరు కావాలని ఆమె కోరారు.


ఏలూరులో రంగులు చల్లుకుంటున్న యువకులు


టి.నరసాపురంలో విద్యార్థినుల హోలీ సందడి


రంగుల సరదాతో ఉత్సాహంగా చిందులేస్తున్న యువతులు

రంగుల హోలీ

జిల్లాలో పట్టణాలు, గ్రామాల్లో హోలీ సంబరాలు ఉత్సాహంగా సాగాయి. కేరింతలు, ఆనందోత్సాహాల మధ్య సోమవారం రంగులు చల్లుకున్నారు. చిన్నారులు, యువత, పెద్దలు కలసి ఆడిపాడుతూ రంగులు పూసుకుంటూ సందడి చేశారు. యువకులు ద్విచక్రవాహనాలపై వీధుల్లో కేరింతలు కొట్టారు. ప్రదర్శన నిర్వహించారు. ప్రతి వీధి రంగులమయంగా మారింది. చిన్న పిల్లలు రంగు తుపాకీలతో సందడి చేశారు. ఏలూరు రూరల్ మండలంలో పలు గ్రామాల్లో రంగులు పులుముకుని కోడిగుడ్లు విసురుకున్నారు. చింతలపూడి మండలంలో గిరిజన లంబాడీలు సంప్రదాయ వస్త్రాలు ధరించి నృత్యాలు, రంగులతో సందడి చేశారు. నామవరం, నాగిరెడ్డిగూడెం, వెంకటాపురం, రేచర్ల, పంతంగులగూడెం, కృష్ణాపురం తదితర గ్రామాల్లో లంబాడీలు హోలీ వేడుకగా చేశారు. పట్టణంలో మార్వాడీ కుటుంబాలు కూడా దుకాణాలను మూసివేసి రంగులు చిమ్ముకుంటూ హోలీ జరుపుకున్నారు. పోలవరం మండలంలో విద్యార్థులు, చిన్నారులు, పోలవరం ప్రాజెక్టు కార్మికులు ఉత్సాహంగా రంగులు చల్లుకుని సందడి చేశారు. దెందులూరు మండలంలోని పలు గ్రామాల్లో కొవ్వలి, పోతునూరు, గోపన్నపాలెం, శ్రీరామవరం, మేదినరావుపాలెంతో పాటు పలు గ్రామాలోని కాలనీలలో చిన్నారులు రంగుల డబ్బాలతో కేరింతలు కొట్టారు. టి.నరసాపురం మండలంలో విద్యార్థులు, యువత రంగునీళ్లు చిమ్ముకుంటూ కేరింతలు కొట్టారు.

ఏలూరు రూరల్, చింతలపూడి, పోలవరం, దెందులూరు, టి.నరసాపురం


దెందులూరులో ఉత్సాహంగా రంగులు చల్లుకుంటున్న బాలలు


రంగులు చల్లుతున్న చిన్నారులు, మహిళలు


ఏలూరులో రంగులు పూస్తున్న చిన్నారి


రంగులు చల్లుకుని యువత కేరింత

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కార్పొరేషన్ :** స్వామి అయ్యప్ప జయంతి సందర్భంగా నగరంలోని అయ్యప్పస్వామి ఆలయాలు, దొండపాడులోని బాల అయ్యప్ప క్షేత్రం వద్ద, శనివారపుపేట మణికంఠ సేవా సమితి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అగ్రహారంలోని పాత శివాలయం ప్రాంగణంలో భక్తులు అయ్యప్పస్వామికి అభిషేకాలు, చేశారు. పత్తేబాదలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద భక్తులు సామూహికంగా భజనలు నిర్వహించారు. ఈ మేరకు అయ్యప్పస్వామి ఆలయాల వద్ద స్వామివారి నామస్మరణతో మార్మోగాయి.
- ఏలూరు ఆదివారపుపేటలోని షిరిడీ సాయి ప్రేమ మందిర్ పంచమ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. మాల ధరించిన సాయి భక్తులు భిక్షాటన నిర్వహించారు. దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించి మాల విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త, టీడీపీ నాయకులు ఇనుకపల్లి తాతారావు భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.
- తంగెళ్ళమూడిలో పునర్నిర్మితమైన ఆలయంలో ఈనెల 27న రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఆహ్వాన కమిటీ తెలియచేసింది. సోమవారం ఆలయ ప్రాంగణంలో పలు పూజలు, హోమాలు నిర్వహించారు.
- **కామవరపుకోట :** ఆడమిల్లి శనీశ్వరాలయ ప్రాంగణంలోని కనకదుర్గమ్మ అమ్మవారికి లక్ష్మీ జయంతి సందర్భంగా సోమవారం ఆలయ ధర్మకర్త తాతా సర్వేశ్వరరావు దంపతులు విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు దారముక్కల ప్రవీణ్‌శర్మ భక్తులతో పూజలు చేయించారు.
- **లింగపాలెం :** గ్రామంలో కోదండ రామాలయం పునఃప్రతిష్ఠకు సిద్ధమైంది. ఆలయం జీర్ణావస్థకు చేరడంతో పునర్నిర్మించారు. ఆలయానికి సుమారు 160సంవత్సరాల చరిత్ర ఉంది. జీర్ణావస్థకు చేరిన ఆలయాన్ని ఇటీవల గ్రామస్థులు పునర్నిర్మించారు. ఈ నెల 28న ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో వాహన తనిఖీలు

వాహనాల విస్తృత తనిఖీ

ముదినేపల్లి, మార్చి 25 : ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం స్టాటిక్ సర్వే టీం వాహనాల తనిఖీలను ముమ్మరం చేసింది. నంబర్ 165 పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ఏలూరు, కృష్ణా జిల్లాల సరిహద్దులో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద కైకలూరు, గుడివాడ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు, పోలీసు సిబ్బంది వాహనాల తనిఖీలను నిర్వహిస్తున్నారు. ఏలూరు జిల్లా నుంచి కృష్ణా జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను ఆ జిల్లా ప్రారంభంలో చౌటపల్లి చెక్ పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా, కృష్ణా జిల్లా వైపు నుంచి వచ్చే వాహనాలను ఏలూరు జిల్లా ప్రారంభంలో పెదపాలపర్రు చెక్ పోస్టు వద్ద ఎస్ఎస్‌టి అధికారులు, సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. రాజకీయ సంబంధ వాహనం అయితే మరింత క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముదినేపల్లి తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్.కుమారి, ఎంపీడీవో గంగాధరరావు, ఈవోపీఆర్డీ లక్ష్మీనారాయణ, మండల పరిషత్ ఏవో రమణబాబు తదితరులు తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

కలిదిండి: కోడ్ అమలులో ఉండటంతో మద్వానిగూడెం చెక్ పోస్టు, పలు ప్రధాన రహదారుల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ సోమవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాల్లో ఆధారాలు లేకుండా నగదు, గిఫ్టులు తరలిస్తే చర్యలుంటాయన్నారు. తాడినాడ, కలిదిండి ప్రధాన రహదారుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. తహసీల్దార్ దశిక వంశీ, ఎస్ఐ ప్రియ కుమార్ పాల్గొన్నారు.



వైసీపీకి బొడ్డు నోబుల్ రాజీనామా

» కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు వెల్లడి

కైకలూరు, మార్చి 25: వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బొడ్డు నోబుల్ తెలిపారు. సోమవారం కైకలూరులోని తన నివాసంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ వైసీపీ ఏర్పడిన నాటి నుంచి అంకితభావంతో పనిచేశానని 2014, 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేశానని అయినా ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు తనను అవమానాలకు గురిచేశారని అందు వల్లే పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. ఇటీవల పార్టీ అధిష్ఠానాన్ని కలిసిన సమయంలో అసెంబ్లీ ఎన్నికల్లో దూలం నాగేశ్వరరావుకు టిక్కెటు ఇస్తే తాను పనిచేయనని స్పష్టం చేశానని అయినా ఆయనకే టిక్కెట్ కేటాయించారన్నారు. దళితుల ఓటు బ్యాంకును వాడుకుని తరువాత కక్ష సాధిస్తూ దళిత గ్రామాల్లో అభివృద్ధిని దూరం చేశారన్నారు. కైకలూరులో ఎప్పుడూ లేని విధంగా రౌడీ మూకలను తయారు చేసి అన్నివర్గాలపై దాడులు చేయించి అవినీతిని ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అందుకే వైసీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానన్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశిస్తే రానున్న ఎన్నికల్లో కైకలూరు నియోజకవర్గం నుంచి పోటీ చేస్తానని స్పష్టం చేశారు. వాసిపల్లి రమేష్, పళ్లెం ప్రకాష్, దావీదు, కోనాల జయరాజు, గోలి జానోస్, ఎం. కోటేశ్వరరావు, యాళ్ళ ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు విశేష పూజలు



మండవల్లి, మార్చి 25: మండవల్లిలో భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి జన్మతిథి సందర్భంగా సోమవారం స్వామివారికి విశేష పూజలు జరిగాయి. 27 రకాల పూజా ద్రవ్యాలతో అభిషేకాలు, విశేషపూజలు చలపతి గురుస్వామి, శ్రీను గురుస్వామి ఆధ్వర్యంలో పండితులు ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప శరణఘోషతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శోభనాచలుడికి ఊంజల ఉత్సవం



ఆగిరిపల్లి, మార్చి 25: ఫాల్గుణ పౌర్ణమి (హోలీ పౌర్ణమి)ని పురస్కరించుకుని ఆగిరిపల్లి పెద్ద కొండలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఊంజల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. వేదపాఠశాల విద్యార్థుల వేద మంత్రాల నడుమ, స్వామివారి పవళింపు సేవ వైభవంగా జరిగింది. అనంతరం జరిగిన గ్రామోత్సవంలో చక్రవాహనంపై స్వామివారు కొండమీదికి చేరుకున్నారు. కార్యక్రమాన్ని ప్రధానార్చకులు వేదాంతం శేషుబాబు, అనంత కృష్ణ నిర్వహించారు.

వైభవంగా వేంకటాచలుడి తిరు కల్యాణం



ముసునూరు, మార్చి 25: ముసునూరులోని వేంకటాచల స్వామి తిరు కల్యాణం ఆలయ ఛైర్మన్ దేవినేని వరప్రసాద రావు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. వందలాది మంది భక్తుల నడుమ, వేదపండితులు లక్ష్మీనారాయణచార్యులు, సాయి స్వామి, లక్ష్మీనరసింహాచార్యుల మంత్రోచ్ఛరణలతో దేవినేని వాసుదేవరావు, దేవినేని విజయ్ దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణం జరిపించారు. అనంతరం కల్యాణ మూర్తులకు పల్లకి సేవ నిర్వహించారు. సోమవారం మేళతాళాలతో కల్యాణమూర్తులకు గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవినేని రామకృష్ణ, పోలవరపు సత్యనారాయణ, దేవినేని వెంకటేశ్వరరావు, రేగుల రాజా తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

లక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం



ముదినేపల్లి రూరల్, మార్చి 25: సింగరాయపాలెంలోని లక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారిని విద్యుద్దీపాలతో అలంకరించిన ప్రత్యేక రథంపై పురవీధుల్లో ఊరేగించారు. స్వామివారిని భక్తులు భారీగా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఇన్‌చార్జ్ ఈవో సింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

పేకాట స్థావరంపై దాడి.. 10 మంది అరెస్ట్

మండవల్లి, మార్చి 25: మండవల్లి మండలం అయ్యవారి రుద్రవరం డొంకలో పేకాడుతున్న 10 మంది జూదరులను మండవల్లి పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.11,900లు నగదు, 12 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మండవల్లి ఎస్సై సీహెచ్ఎస్ రామచంద్రరావు ఆధ్వర్యంలో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు.

గడ్డి వాము, పశువుల పాక దగ్ధం

కైకలూరు, మార్చి 25: పశువులపాక, గడ్డి వాము దగ్ధమై రూ.10 వేల ఆస్తినష్టం జరిగింది. సోమవారం రాత్రి కైకలూరులోని పెద్దమసీదు వెనుక తిరుమాల సత్యనారాయణకు చెందిన పశువుల పాక, గడ్డివాముకు ఆకస్మికంగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వగా అగ్నిమాపక శాఖాధికారి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది మంటలను అదుపు చేసి పాకలో ఉన్న ఒక ఆవు, రెండు గేదెలను రక్షించారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

కైకలూరు

గొంతెండుతోంది..

» అడుగంటిన చెరువు » రోజు విడిచి రోజు మంచినీటి సరఫరా
» పనిచేయని రక్షిత మంచినీటి పథకాలు.. » పసర్ల నీరే దిక్కు
» అధ్వానంగా ప్రధాన బోదె » నీరు వదిలినా చేరే అవకాశం లేదు!



అడుగంటిన కైకలూరు మంచినీటి చెరువు (ఇన్‌సెట్) చెత్తతో నిండిన బోదె

వేసవి ప్రారంభంలోనే తాగునీటి ఎద్దడి తీవ్రంగా మారింది. ఇటీవల ఎండలు బాగా పెరగడంతో మంచినీటి చెరువులో నీరు అడుగంటి ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. ఇప్పటికే రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేస్తున్నారు. నీరు ఆకుపచ్చరంగులోకి మారినా ఫిల్టర్ చేయకుండా నేరుగా కుళాయి ద్వారా సరఫరా చేస్తున్నారు. ఈ నీటిని ప్రజలు తాగలేక ఆర్వో ప్లాంట్లకు పరుగులు తీస్తున్నారు.

కైకలూరు, మార్చి 25: కైకలూరు మండలంలో ఏ గ్రామంలో చూసినా మరో 10 నుంచి 15 రోజుల వరకు మాత్రమే మంచినీరు అందే పరిస్థితులున్నాయి. ప్రధానంగా కైకలూరు, ఆటపాక, భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు, దొడ్డిపట్ల, సీతనపల్లి, రామవరం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలువలకు నీరు వదిలే సమయంలో సరైన ప్రణాళిక లేక ఆయా గ్రామాల్లో ముందుగానే నీటి ఎద్దడి ఏర్పడింది. మార్చి నెలలోనే ఇలా ఉంటే రానున్న ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితి ఏమిటని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కైకలూరు పట్టణంలో సుమారు 40 వేల మంది జనాభా ఉండగా రోజు విడిచి రోజు నీరు ఇవ్వడంతో నీరు చాలక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. దీంతో ఎక్కువ మంది ప్రజలు గ్రామాల్లోని ఆర్వో ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇప్పటికైనా ప్రణాళికాబద్ధంగా కాలువలకు నీరు విడుదల చేస్తే వేసవిలో ఎద్దడి ఉండదని అంటున్నారు.

అధ్వానంగా బోదె... నీటి సరఫరా ఎలా?

కైకలూరు రైల్వేస్టేషన్ వద్ద ఉన్న మంచినీటి చెరువుకు కైకలూరులోని ఆర్సీఎం చర్చి వెనుక పంటకాలువ నుంచి బోదె వెంబడి నీరు చెరువులోకి చేరుతుంది. ఆ పంటబోదె మొత్తం వ్యర్థాలతో పూడుకుపోయి అధ్వానంగా మారింది. ఆ రహదారి గుండా వెళితేనే పంటబోదె దుర్గంధాన్ని ప్రజలు భరించలేరు. బోదె మరమ్మతులు నిర్వహించకుండా మంచినీరు చెరువులకు నీరు విడుదల చేసినా సక్రమంగా నీరు సరఫరా అయ్యే పరిస్థితులు కన్పించడంలేదు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన పంట బోదెలోని వ్యర్థాలను తొలగించాలని కైకలూరు ప్రజలు కోరుకుంటున్నారు.



నూజివీడులో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పార్థసారథి.. వైసీపీ నేతలకు కండువాలు కప్పి కూటమిలోకి ఆహ్వానిస్తున్న కామినేని

అధికారంలోకి రాగానే టిడ్కో ఇళ్లు

నూజివీడు, మార్చి 25: టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందేలా చర్యలు చేపడతానని నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని 13, 14 వార్డుల్లో సోమవారం మన ఇంటికి మన సారథి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికి నివేశనా గృహాలు ఉండాలన్న ఆశయంతో నూజివీడు పట్టణంలో రూ.240 కోట్ల వ్యయంతో టిడ్కో గృహాలను ప్రారంభించి 80 శాతం పూర్తి చేసిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చాక టీడీపీ పథకం అని టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా చేయటమే కాక వారి నుంచి టిడ్కో గృహాల పేరుతో లక్షలాది రూపాయల రుణాలు తీసుకునేలా చేసి లబ్ధిదారులను అప్పుల ఊబిలోకి నెట్టిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే రుణ ఉపశమనం కల్పించే దిశగా చర్యలు చేపట్టడంతో పాటు ఆరు నెలల్లో టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా తాగునీటి ఇబ్బందులను అధిగమించేందుకు పట్టణంలో పూర్తిస్థాయిలో చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు. తొలుత బాపూనగర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఆయన పట్టణంలో సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. నూజివీడు మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు మల్లిశెట్టి జగదీష్, పల్లి నాగరాజు, టీడీపీ నాయకులు కొడవటి భాస్కర్‌రావు, బొడ్డు రాజు, లాగు కుమార్, మాజీ కౌన్సిలర్ కందిపల్లి చెన్నారావు, పాదం సత్యనారాయణ, గొల్లు దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

కామినేని సమక్షంలో కూటమిలో చేరిన వైసీపీ నేతలు

కైకలూరు: కైకలూరు నియోజకవర్గంలో వైసీపీ అరాచకాలను తట్టుకోలేక ఆ పార్టీ నేతలే ఎన్డీయే కూటమిలో చేరుతున్నారని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కైకలూరు మండలం వరహాపట్నం గ్రామంలోని మాజీ సర్పంచ్‌లు బోయిన కృష్ణమూర్తి, బోయిన శ్రీనివాసరావు తదితర వైసీపీ నాయకులు సుమారు 300 మంది ఎన్డీయే కూటమిలో చేరారు. వీరందరికీ డాక్టర్ కామినేని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచకాలు తట్టుకోలేక ఆదివారం కలిదిండిలో భారీగా కూటమిలో చేరగా రెండో రోజు వరహాపట్నం నుంచి పెద్దఎత్తున ఈ చేరికలు జరగడం కూటమి విజయానికి పునాదులన్నారు. ఎంతో బలిష్టమైన కూటమిలోకి రానున్న రోజుల్లో పెద్దఎత్తున చేరతారని కామినేని వెల్లడించారు. వైసీపీని సాగనంపేందుకు ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకుడు బీకేఎం నాని, పూల రామచంద్రరావు, పళ్లెం వెంకటేశ్వరరావు, తాడినాడ బాబు, పామర్తి రాంబాబు, పళ్లెం ఆగస్టీన్, పళ్లెం తాతారావు, కాగితాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ నేతలు

గౌడ సంఘీయులంతా ఐక్యంగా ఉండాలి

కైకలూరు, మార్చి 25: తమకు గుర్తింపు ఇచ్చిన పార్టీకే ఐక్యంగా మద్దతు తెలుపుతామని గౌడ సంక్షేమ సంఘం నాయకులు పోసిన చెంచు రామారావు, బొర్రా చలమయ్య అన్నారు. సోమవారం లోకుమూడి దత్తాశ్రమంలో నిర్వహించిన కైకలూరు నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడుతూ గౌడ సామాజిక వర్గానికి ఏ పార్టీలోనూ సరైన గుర్తింపు రావడం లేదని, ఇతర కులాలతో ఐకమత్యంగా ఉంటూ సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని తద్వారా రాజకీయ పార్టీలో ఉన్నత పదవులు కూడా వస్తాయన్నారు. సంఘ నాయకుడు పోసిన పాపారావుగౌడ్ మాట్లాడుతూ గతంలో తాను వైసీపీలో ఉన్నానని కైకలూరు పోలీసుస్టేషన్‌కు వేరే వ్యక్తిని విడిపించుకోవాలని వెళితే ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు కుమారుడు పోలీసు స్టేషన్లోనే తన రౌడీ మూకలతో దాడి చేయించారని వెల్లడించారు. పోలీసుస్టేషన్లో తనను కుర్చీలో కుర్చోపెట్టినందుకు పోలీసులను సైతం బూతులు తిట్టారని ఇలాంటి అరాచక పాలన చేసే నాయకులకు ఓటుతో ద్వారా బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు పోలగాని నాగరాజు, గౌడ సంఘ నేతలు వీరమల్లు నరసింహా రావు, పరసా ఏడుకొండలు, వీరమల్లు సత్యనారాయణ, పరసా విశ్వేశ్వరరావు, పోసిన పాండురంగారావు, వీరంకి వెంకయ్య, దావు నాగరాజు, గూడవల్లి శ్రీనివాసరావు, కట్టా నాగరాజగౌడ్, కట్టా నాగబాబు, బొల్లా శ్యామలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు కాంగ్రెస్ టిక్కెట్టుకు వినతి

ముదినేపల్లి, మార్చి 25 : కాంగ్రెస్ పార్టీ తరపున కైకలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని పీసీసీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిలను కోరినట్లు స్నేహ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి కమతం నిరీక్షణ రావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల ద్వారా సుమారు 30 ఏళ్ల పాటు ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించానని తెలిపారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలసి తనకు పార్టీ అభ్యర్థిత్వం కల్పించాలని కోరినట్లు తెలిపారు.

కైకలూరు సీటు జనసేనకే కేటాయించాలి

ముదినేపల్లి రూరల్, మార్చి 25: కైకలూరు అసెంబ్లీ అభ్యర్థిగా జనసేనకు చెందిన బీవీ రావుకు అవకాశం ఇవ్వాలని ఆ పార్టీ మండల గౌరవ అధ్యక్షుడు దేవేంద్ర గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి ఆయన ఎంతో కృషిచేశారని అలాంటి వ్యక్తికి సముచిత స్థానం కల్పించాలని కోరారు.



సంఘస్థులతో మాట్లాడుతున్న కట్లయ్య

రజకులకు ప్రాధాన్యమివ్వాలి

ఆగిరిపల్లి, మార్చి 25: రాజకీయంగా రజక సామాజిక వర్గం అణచివేతకు గురవుతోందని, రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల రజకులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే రాజకీయ పార్టీలు చూస్తున్నాయని, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ఆరోపించారు. ఈదరలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రజక సామాజికవర్గ మహిళలను గుంటూరులో టీడీపీ గుర్తించటం అభినందనీయమని, అయితే పోటీలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీలు రజకులను గుర్తించటం లేదని, రజకుల వృత్తి విషయంలో ప్రభుత్వం జీవోలు ఇచ్చినప్పటికి క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, తమకు ప్రాధాన్యం ఇవ్వని పార్టీలకు గుణపాఠం చెబుతామన్నారు. జిల్లా నేతలు పగడాల సాంబశివరావు, ఈదర రజక సంఘం నాయకులు డి.నారాయణ వీరస్వామి, గోపి, శ్రీనివాస్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మహేష్ యాదవ్‌ను కలసిన కైకలూరు నేతలు

కైకలూరు, మార్చి 25: ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్ యాదవ్‌ను కైకలూరు టీడీపీ నేతలు కలసి అభినందనలు తెలిపారు. సోమవారం పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో ఆయనను మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, టీడీపీ నాయకుడు బీకేఎం నాని, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు, ఏలూరు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు తదితరులు కలిశారు. అందరూ సమష్టిగా కృషి చేసి టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని మహేష్ యాదవ్ కోరినట్లు తెలిపారు. రాష్ట్రంలో సుస్థిర పాలన రావాలంటే అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు కూటమి గెలుపొందాలని, అప్పుడే ప్రజలకు అన్ని విధాలా మంచి జరుగుతుందని ఆయన సూచించినట్లు తెలిపారు. త్వరలోనే కైకలూరు నియోజకవర్గంలో పర్యటిస్తానని తెలిపారన్నారు.



సుగాలి మహిళలతో హోలీ వేడుకల్లో నూజివీడు కూటమి అభ్యర్థి పార్థసారథి.. ముదినేపల్లిలో హోలీ వేడుకలు

ఉత్సాహంగా హోలీ

నూజివీడు టౌన్, మార్చి 25: హోలీ పండుగను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. నూజివీడు మండలంలోని సుగాలీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో హోలీని సంప్రదాయ రీతిలో జరిపారు. నూజివీడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి నూజివీడు మండలం సిద్ధార్థనగర్‌లో సుగాలి మహిళల మధ్య హోలీ వేడుకను నిర్వహించారు. వారితో సంప్రదాయ నృత్యం చేసి ఆకట్టుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి రాగానే వారి హక్కులను పరిరక్షిస్తామని నివేశనా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపడతామన్నారు. డివిజన్ కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవి బిడ్డలైన సుగాలీలు మౌలిక వసతులకు దూరంగా ఉండటంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. టీడీపీ నియోజకవర్గ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, జనసేన నాయకులు మరీదు శివ రామకృష్ణ, టీడీపీ నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరు రాజా, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావతు నాగు, బాణావతు సోనియా, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

ముదినేపల్లి: హోలీ పండుగను సోమవారం ముదినేపల్లి ప్రాంతంలో ఘనంగా జరుపుకున్నారు. ముదినేపల్లిలోని రాజస్థానీయులు, పలు ప్రైవేట్ కంపెనీల్లో పని చేస్తున్న బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల ఉద్యోగులు, కార్మికులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కోలాహలంగా ప్రదర్శనలు జరిపారు. రాజస్థానీయులు తమ వ్యాపార సంస్థలను అలంకరించారు. మండలంలోని వడాలి, సింగరాయిపాలెం సెంటర్లలో హోలీ వేడుకలు నిర్వహించారు.

జెండా దిమ్మె రంగు మార్చారు



ఆగిరిపల్లి, మార్చి 25: ఆగిరిపల్లి మండలం కొత్త ఈదరలో ఎలక్షన్ కోడ్ వచ్చినా జెండా దిమ్మెకు వైసీపీ రంగు ఉందని అధికారులకు ఫిర్యాదు అందింది. ఫిర్యాదును పురస్కరించుకుని అధికారులు జెండాదిమ్మకు తెలుపురంగు వేయించినట్లు ఎంపీడీవో పి.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రచారానికి అనుమతులు తప్పనిసరి: ఆర్డీవో



నూజివీడు టౌన్, మార్చి 25: సార్వత్రిక ఎన్నికల్లో అనుమతులు లేకుండా ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని నూజివీడు ఆర్డీవో భవానీ శంకరి తెలిపారు. సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, వారి ప్రతినిధులు సంబంధిత ప్రచారాలకు సంబంధించి సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో వివిధ శాఖల అధికారులకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండేదని, ప్రస్తుతం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకుంటే అన్ని శాఖల నుంచి అనుమతులు వస్తాయన్నారు. అయితే 48 గంటల ముందు సంబంధిత దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, తాము దరఖాస్తులు చేసుకున్న 12 గంటల్లో అనుమతులు మంజూరు చేయటం జరుగుతుందన్నారు. అదేవిధంగా బ్యానర్లు, కరపత్రాలు ప్రింట్ చేసేవారు పబ్లిషర్, ప్రింటింగ్ ప్రెస్ వివరాలను వాటిపై విధిగా ప్రింట్ చేయాల్సి ఉంటుందన్నారు. 80 ఏళ్లు దాటినవారు, కదల్లేని వారికి ఇంటివద్దే ఓటు వేసే దిశగా ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇందుకు సంబంధించి పోలీస్ అధికారితో పాటు మరో పోలింగ్ అధికారి ఆయా వ్యక్తుల దగ్గరకు వెళ్ళి బ్యాలెట్‌ను స్వీకరించటం జరుగుతుందన్నారు. నూతనంగా ఓటుహక్కు పొందిన 27 వేల కార్డులను ప్రింట్ చేసి పోస్ట్‌లో పంపామన్నారు. తెలంగాణ సరిహద్దులో ఉన్న చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం తదితర ప్రాంతాల్లో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముసునూరు, మార్చి 25: గురుకుల పాఠశాలల్లో ప్రవేశం పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ముసునూరు బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కొండబత్తుల ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నాల్గో తరగతి చదువుతున్న బాలబాలికలు ఐదో తరగతిలో ప్రవేశం పొందేందుకు ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో ముసునూరు, నిమ్మకూరు, పులిగడ్డ, ఏలూరు జిల్లాలో నాగిరెడ్డిగూడెం, అప్పలరాజుగూడెంలో ఉన్న గురుకుల పాఠశాలల్లో నిబంధనల మేరకు ప్రవేశం పొందవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు. వివరాల కోసం సెల్ నంబర్ 87126 25032లో సంప్రదించాలన్నారు.

శోభనాచలుని ఆలయ ఈవోగా సురేష్‌బాబు

ఆగిరిపల్లి, మార్చి 25: ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఈవోగా సురేష్‌బాబును నియమిస్తూ దేవదాయ ధర్మదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రాజమండ్రిలో గ్రేడ్ -1 ఆఫీసర్‌గా పని చేస్తున్న సురేష్‌బాబు సోమవారం ఆగిరిపల్లిలో బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇన్‌చార్జ్ ఈవోగా ఎన్టీఆర్ జిల్లా మాచవరం దాసాంజనేయస్వామి ఆలయ ఈవోగా ఉన్న నాగినేని భవాని పనిచేశారు.

సప్తగిరి బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

ఆగిరిపల్లి, మార్చి 25: సప్తగిరి బ్యాంక్ ఉద్యోగుల సమ్మె వాయిదా పడింది. క్యాజువల్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలను అంగీకరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న తలపెట్టిన సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యూనియన్ అధ్యక్షుడు శివరాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్చరీలో యుక్తశ్రీకి పసిడి



నూజివీడు టౌన్, మార్చి 25: ఆర్చరీ విభాగంలో నూజివీడుకు చెందిన యువతి బంగారు పతకాన్ని సాధించింది. కొండపావులూరి సాయి వెంకటగిరి కుమార్తె యుక్తశ్రీ చెన్నైలో ఈ నెల 23, 24 తేదీల్లో ఎన్టీపీసీ సౌత్ జోనల్ ఓపెన్ ఆర్చరీ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించింది. పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు.

మాగంటి శ్రీనివాసరావు ఎన్నికపై హర్షం

నూజివీడు టౌన్, మార్చి 25: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మాగంటి శ్రీనివాసరావు ఎన్నిక కావడం పట్ల నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు డొక్కు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేశినేని ప్రభాకర్ రావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం వారు నూజివీడులో విలేకరులతో మాట్లాడుతూ సమస్యలపై నిబద్ధతతో పోరాడుతూ అయన ఈ స్థాయికి వచ్చారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఆగిరిపల్లిలో వృద్ధాశ్రమ కార్యాలయం ప్రారంభం



ఆగిరిపల్లి, మార్చి 25: పిల్లల ఆదరణ కరువై, బ్రతుకు భారమైన వృద్ధులకు అండగా నిలవడం కోసం సింగన్నగూడెంలో హ్యూమన్ సర్వీస్ ఆర్గనైజేషన్, రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ బ్రాంచ్ ఆఫీస్‌ను రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ మల్లాది విష్ణు ప్రారంభించారు. ఎస్ఆర్ఐ కళాశాల ప్రొఫెసర్ మాదిరెడ్డి చైతన్య కిషోర్‌రెడ్డి ఈ సంస్థ ఆఫీస్‌ను ప్రారంభించారు. సంస్థ అధ్యక్షులు పంతగాని నానయ్య మాట్లాడుతూ విజయవాడలో ఉన్న హెడ్ ఆఫీస్‌కు ఇది బ్రాంచ్ అని, అనాథ పిల్లలను, వృద్ధులను చేరదీసి ఆదుకుంటామని తెలిపారు.

పేదల బతుకులు మారుస్తా : ముద్దరబోయిన

నూజివీడు టౌన్, మార్చి 25: తనకు అవకాశమిస్తే పేదల బతుకుల్లో మార్పు తీసుకువచ్చేందుకు చర్యలు చేపడతానని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడు మండలం దిగవల్లిలో ముద్దరబోయిన అభిమానుల ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు వచ్చినప్పుడల్లా పేదల సాగు భూములకు పట్టాలిప్పిస్తానని చెప్పే రాజకీయ నాయకులు అధికారంలోకి వచ్చాక వాటిని మరిచిపోతున్నారన్నారు. తాను విజయం సాధిస్తే జమీందారీ భూములకు శాశ్వత భూహక్కు పత్రాలు ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

మజ్జిగ వితరణ



ముదినేపల్లి, మార్చి 25 : ముదినేపల్లిలోని మసీదు సెంటర్‌లో ఎలక్ట్రికల్ అండ్ రీవైండింగ్ వర్క్ షాపు యాజమాన్యం సోమవారం ప్రజలకు వేసవి దృష్ట్యా మజ్జిగ పంపిణీ చేసింది. వర్క్ షాపు యజమాని ఎస్.బాపూజీ ఆధ్వర్యంలో స్థానిక ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కూనపరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొని సుమారు 300 మందికి మజ్జిగ పంపిణీ చేశారు.

మట్టి తవ్వకాలపై అధికారుల దాడి



మట్టి అక్రమ తవ్వకాలు

ముసునూరు, మార్చి 25: మండలంలోని వేల్పుచర్ల పంచాయతీ శివారు అన్నపనేనివారి గూడెంలోని గూడెం చెరువులో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలపై ఆదివారం రాత్రి రెవెన్యూ అధికారులు దాడి చేశారు. రెండు రోజులుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని స్థానికుల ఫిర్యాదు మేరకు, ఆర్ఐ దీపిక, వీఆర్వో సురేష్ దాడి చేయగా ఎక్స్‌కవేటర్‌తోపాటు మరికొన్ని ట్రాక్టర్‌లతో పరారయ్యారు. ఈ దాడిలో ఒక ట్రాక్టర్ మాత్రమే పట్టుబడగా, రూ. 5 వేలు జరిమానా విధించినట్టు తహసీల్దార్ జవహర్ బాజి తెలిపారు. మండలంలో మట్టి తవ్వకాలకు అనుమతులు లేవని, అక్రమంగా తవ్వితే భారీ జరిమానా విధించడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.